# యజ్ఞం

మూడేళ్ళ కిందట పుట్టి, మూడు నెల్లుగా ముడిపడి, మూడు రోజుల్నించి నలుగుతున్న తగవు, ఆ వేళ యిటో అటో తేలిపోతుంది – ఆ భావం ఆ వూరి గాలిలో అలాఅలా తేలుతోంది.

సొమ్ములు మందలకు పోయేవేళ అంటే తెలియదు. పదిగంటల వేళ.

ఆ గ్రామం పేరు సుందరపాలెం. మదరాసునుండి కలకత్తాకు – విశాఖపట్నం మీదుగా విజయనగరం కెడంగా – పోయే గ్రాండ్ ట్రంక్‌రోడ్డు నుండి ఆరు మైళ్ళు కుడిగా సముద్రానికి ఐదు మైళ్ళు ఎడంగా – కాకిమార్గాన పోతే శ్రీకాకుళానికి పదిహేను మైళ్ళలో ఉందా గ్రామం.

ఆ వూరికి ఈశాన్యానా, తూర్పునా, సముద్రంకేసి దక్షిణంగాను – మెరక భూములు. తక్కిన దిక్కులకేసి పల్లం.

నడి వర్షాకాలం ఎండవేళ ఆ పొలిమేర తాటితోపుల్లో కనిపించే దృశ్యం సుందరమైనదే. మధ్యగా చిక్కని కొబ్బరి చెట్లూ, చిల్లర చెట్ల నీడని ఆ చిన్న గ్రామం. ఆ మీద పచ్చ పచ్చగా, ఎర్ర ఎర్రగా, నల్లగా, తెల్లగా, బూడిద రంగులో మెరక భూములు, తాటి పెండెలూ, మొగలి డొంకలూ వాటికి సరిహద్దురేఖగా వుంటాయి. కింద పచ్చని వరిచేలు. మధ్య అక్కడక్కడా వెండిలా, ఎండలు నిండుగా మెరిసే నిండు నిండు చెరువులు.

అయితే–

సుందరపాలెం ఏటా వెళ్ళే వాళ్ళక్కూడా ఎప్పుడోగాని ఇలాంటి అందమైన దృశ్యాలు కనుపించవు.

ఆ గ్రామం అంతా కలిసి నాలుగు వందల ఇళ్ళు – ఒక చిన్న దేవాలయాన్ని చుట్టి వుంటాయి. మిగిలినవి కొత్తగా వచ్చిన హైస్కూలు చుట్టూ లేచిన యిళ్ళు.

కొత్తగా ఇళ్ళల్లో ఒక భాగం షాపులు, హోటేళ్ళు మొదలైనవి. మిగిలినవి, పెరిగే జనాభాకోసం పెరిగినవీ, పెరుగుతున్నవీ.

ఆ కోస్తాలో సుందరపాలెం పలువురు అనాథల నడుమ పచ్చగా బతికే సనాథలా కనిపిస్తుంది. దాన్ని గ్రాండ్ ట్రంకు రోడ్డుతో కలిపే ఆరుమైళ్ళ పక్కా రోడ్డూ, దేశమంతటా చిక్కంలా పరచుకొంటున్న విద్యుద్వలయం తో ఒక్క వరుసను ఆరున్నొక్క మైళ్ళ విద్యుద్వాహకాలూ – ఆ వూరి సౌభాగ్యాలు.

ఇంకా, గొల్లవీధి నానుకొని ఓ పోస్టాఫీసు తెరిచారు. తెలికలి వీధిలో విలేజీ లెవెల్ వర్కరుగారి ఆఫీసూ, యిల్లూ ఏర్పాటయేయి. హైస్కూలు వీధిలో ఆసుపత్రీ, మెటర్నిటీ సెంటరూ పెట్టేరు. మాలపేటకూ వూరికి మధ్య కోపరేటివ్ వారి గోడౌన్లు పుట్టేయి. మునసబు గారి వీధిలో గ్రంథాలయం, కరణంగారి వీధిలో ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు వారి "ఆఫీసు" వున్నాయి.

పగలు పదిగంటలంటే పల్లెటూళ్ళలో తీరిక సమయం – ఆరంభం. ఆ వేళపుడు సాటి గ్రామాల్లో వాళ్ళు సుష్టుపూర్తిగా చల్లందులు భోంచేసి బాగా గాలి వేసే చోట్లు చూసుకొని పడకలు వేస్తుంటారు. కొందరు అరుగుల మీదా అక్కడా చేరి కబుర్లు చెపుతూనో, ఆ వూరు, ఆ చుట్టుపట్ల గ్రామాల నుండి పనిమీద వచ్చే జనాలను పట్టుకొని "ఇగటా" లాడుతూనో కాలక్షేపం చేస్తుంటారు. సుందరపాలెంలో జనం, ఎవ్వరోగాని ఆ వేళప్పుడు పడకలు వేయరు. వాళ్ళు కాలక్షేపం చేసే స్థలాలూ, పద్ధతులూ వేరే ఉన్నాయి.

కొందరు కిళ్ళీ కొట్ల ముందుండే సరుగుడు కొయ్యబెంచీల మీదా, హోటళ్ళలో బొక్కి కుర్చీలలోనూ చేరుతారు. మరికొందరు ఆఫీసులుండే ఇళ్ళ ముందు అరుగుల మీదా, గ్రంథాలయంలోనూ, మందిరం చుట్టూ, మండపం పైనా చేరుతారు.

వాళ్ళలో కొందరు ఎలక్ట్రిసిటీ వైరింగ్ గురించీ, ఎసీ డిసీల తేడా గురించి చర్చిస్తుంటే, మరికొందరు పంపింగ్ సెట్ల రిపేర్లు గురించి మాట్లాడుతారు. ఆ వూరు ఆ చుట్టుపట్ల గ్రామ రాజకీయాలు కొందరు తడుఁవుతుంటే, మరికొందరు ఆంధ్ర రాజధాని మీదుగా అమెరికా, రష్యాలు పర్యటించి వస్తారు. సినిమా, రేడియో, సాహిత్యం, మీటింగులు, ఎగ్జిబిషన్లు, విజ్ఞానశాస్త్రం, పురోగతి మొదలైన సమస్త విషయాల గురించి చెప్పగల వాళ్ళూ, చెప్పించుకొనే వాళ్ళూ, విమర్శించి విశదపరచే వాళ్ళూ – సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. పాత మంచిదనుకునే వాళ్ళూ, పాత పాతర్లు తవ్వుకునే వాళ్ళూ లేకపోలేదు. కాని వాళ్ళ సంఖ్య తక్కువ.

అవకాశం గల జనం ఇలా తేలిగ్గా కాలక్షేపం చేసే సమయంలో కూడా, కొందరు తీరికలెరుగని జనం, తెరిపి లేకుండా పనిచేస్తూనే వుంటారు. ఆ సన్నని ఇరుకు వీధుల్లో నెత్తిన నిలువెత్తు గడ్డిమోపులతో, బుట్టలూ, బుంగలూ చేతబూని, భుజాలమీద నాగళ్ళతో, ఎదరను ఏరెద్దులు కదుల్తుండగా, పక్కన నల్లని చిన్న చిన్న పిల్లల చేతుల్లో జిడ్డుపట్టిన తాళ్ళకు వేలాడే చిన్న పెద్ద సీసాలతో, పరుగులు పెట్టే బళ్ళ మొకర్లలో, ఎద్దులను ఓహోలతో అదలిస్తూ, వాకిళ్ళలో పశువులకి కుడుతులు కలుపుతూ, కళ్ళాలలో

మిరపలో మినుములో ఎండపోస్తూ, సొమ్ములను మందలలోకి మళ్ళిస్తూ, నిన్నో మొన్నో ఆర్నెల్ల కిందటో పోయిన భర్తలూ బంధువులూ కోసం శోకాలు పెడుతూ, నెత్తిన బట్టలమోపూ, చేత అంబలి కుండలతో, "కూరోయమ్మ, చుక్కకూర" అంటూ, భుజాన కట్టెల కావిళ్ళు దించి, మూపున బస్తాలెత్తుకొని, చెమటలు తుడుచుకుంటూ, ఒగరుస్తూ పరుగులెడ్తూ ఎండవేళ నెత్తిన నీళ్ళకుండలతో, నడివాకిట ఆ పూటకు గింజలు దంచుతూ వుంటారు.

పదిన్నరకు పంచాయితీ అంటే పనిలేని జనం పది గంటలకే మండపం కేసి నడుస్తున్నారు. ఆ వూరు స్వస్థలం కాని అయ్యవార్లూ, చిన్న ఉద్యోగులూ కూడా వారిలో కొందరున్నారు. ఆనాడు ఆదివారం కావడం ఆ తగువును గూర్చి రెండు రోజులుగా వూరంతా ఒకటే మాటాడుకోవడం వారిలో కూడా కుతూహలాన్ని కలిగించాయి. అప్పల్రాముణ్ణి ఎరగక పోయినా అతడి తగువును గూర్చిన వివరాలు వాళ్ళక్కూడా చాలా తెలుసు.

అప్పల్రాముడంటే ఆ వూరి పంచాయితీలో హరిజన మెంబరు. మాలలకు కులపెద్దే కాక, మాలలందరిలో వయసు మళ్ళిన వాడు.అతడంటే వూరి జనంలో మూడొంతుల ముప్పాతిక మందికి సదభిప్రాయం వుంది. మాటకు నిలబడే వాడూ, మర్యాదగా బతకాలనుకునే వాడూ మాలల్లో అతనొక్కడేనని అందరూ చెప్తారు. తగువుల్లో పేదా రోదా అంటే సానుభూతి కలవాడని కొందరికభిమానం.

ఆ వూరివాడే, ఒక మాజీ షావుకారికి అతను రెండు వేలు బాకీ పడ్డాడు. వడ్డీతో సహా ఇవ్వతేలింది రెండు వేల ఐదు వందలు కాబోలు.

గోపన్నపట్ల జనానికి ఉండే సానుభూతి అంతకు తక్కువ కాదు. ఆయన పరమ సాత్వికుడు. గొప్ప ఓర్పు గలవాడు. ఒకప్పుడు ఘనంగా బతికి, యిపుడు చితికిపోయిన పెద్దమనిషి.

వాళ్ళిద్దరూ తుమ్మకొయ్యల్లా వుండేవారట పూర్వం. "ఈనాటికి పేదతనం వాళ్ళను రచ్చకెక్కించింది" అని నొచ్చుకుంటున్నారు తెలిసిన వాళ్ళంతా.

ఈ తగవు మూడేళ్ళ కిందటే పంచాయతీ ముందుకు రావలసింది. ప్రెసిడెంటు శ్రీరాములు నాయుడు మాధ్యస్థం చాలునన్నాడు. ఆయనా, ఇంకో ఇద్దరు పెద్దలూ, మధ్యస్థులయ్యారు.

మాధ్యస్థులు ముగ్గురూ చితా ఆవర్జాలు ముందేసుకుని చెక్ చేసేరు. శ్రీరాములు నాయుడికి ఎక్కడా తబావుతు కనిపించలేదు. వడ్డీలు అన్యాయమన్నాడు. తక్కిన వాళ్ళు – ఆ ప్రాంతాల్లో చెబుతున్న వడ్డీ అదే అన్నారు. కాదు ప్రభుత్వం వారు ప్రకటించిన రేటున వడ్డీలు కట్టాలన్నాడు. వాళ్ళు మాట్లాడలేకపోయారు. ఇంత ఇవ్వవలసి వుంటుందని లెక్క తేల్చాడు.

కష్టమో, నష్టమో దానికే దోసిలొగ్గాడు గోపన్న. అప్పల్రాముడి దగ్గర అది మాత్రం కూచున్నది గనుకా! అతడికి ఉన్నదల్లా రెండెకరాల ముప్పై సెంట్ల మడిచెక్క. ఆ వూరి ధరల్లో ఉన్నదంతా అమ్మితే గాని ఆ అప్పు తీర్చడం పడదు.

అప్పుడు అప్పల్రాముడన్నాడు.

"బాబూ – గోపన్నబాబు! నా మొహం సూసి కాకపోతే నా పెద్దల మొహం సూసన్నా సెప్పేది సెవినుంచు, నన్నూ, నా పిల్లల్ని కూలోళ్ళను సేసేయకు. తరతరాల బట్టి మాది రైతు కుటుంబం. ఇయాలా, రేపు నా మనవలు కూడా ఎదిగొస్తన్నారు. నానూ, నా కొడుకులూ కాకపోయినా నా మనవలైనా నీ రుణం తీర్చేసుకొంటారు. కానీ వుంచేసుకోరు. నీ ఋణం సానాకాలం బట్టి ఉండిపోనాది. కానీ యింకొక్క మూడేళ్ళు గడువియ్".

మూడేళ్ళనాడు మాత్రం ఎలా తీర్చగలడన్నారు పెద్దలు. శ్రీరాములు నాయుడు టైమిచ్చి తీరాలన్నాడు.

మూడేళ్ళ గడువూ రేపటితో తీరిపోతుంది. మూడు నెలలై గోపన్న పెద్దల వెంట తిరుగుతుంటే "యిదిగో", "అదిగో", "వూరెళ్ళొచ్చి", "మధ్యాహ్నము", "పొద్దున్న" అని తిప్పేశారు. నోటు ఇంకా వారం రోజులకి కాలదోషం పడుతున్నప్పుడు కూడా శ్రీరాములు నాయుడు వూర్లో లేడన్నారు.

నాయుడు విశాఖపట్నం వెళ్ళాడు. వాళ్ళ పెద్ద మేనమామను ఆస్పత్రిలో చేర్చారు. చేర్చి పదిహేను రోజులపైనే అయ్యింది. పాపం పుణ్యం భగవంతుడికి తెలియాలి. రెండు కబుర్లు వెళ్ళినా నాయుడు "యిదిగో", "అదిగో" అంటాడు గానిరాడు.

అప్పుడు గోపన్న లక్షుంనాయుదుని పట్టుకుని అన్నాడు.

"బాబూ లక్షుంనాయుడు! నేను శ్రీరాములు నాయుడ్ని నెప పెడుతున్నాననుకోకు. ఆయన ధర్మరాజు, ధర్మరాజులాగానే ఆయన అజాతశత్రువు. ఒక వంక న్యాయం కోసం ఎవ్వరూ వూరు విడిచి పోకూడదని కట్టడి చేస్తాడు. ఇంకో వంక న్యాయం చెప్పవలసే వేళకు దాటిపోతాడు. లేకపోతే ఆయనకుగాని, ఆయన మేనమామలకు గాని, మంది లేరనా, మార్బలం లేదనా – ఒక్క పూటంటే ఒక్క పూట వచ్చి వెళ్ళడానికి ఆయనకు తీరిక చిక్కడం లేదట" అంటూ అప్పల్రాముడి మనుషులేమంటున్నారో చెప్పి ఆఖర్న యిలా అన్నాడు.

"నాకు అంగబలం మొదటే లేదు. అర్థ బలం ఉండేదిగాని పోయింది. ఎటొచ్చీ ధర్మబలం ఉందికదా, అనుకున్నాను. కానీ అదీ సందేహంలో పడింది.

నువ్వే చెప్పు, నేనేం చెయ్యాలో.

వూరు కట్టడి తప్పి కోర్టుకు వెళ్ళుదునా వూరంతా కలిసి ముఖం మీద వూస్తారు.

వెళ్ళక మిమ్మల్ని నమ్ముకు కూర్చుంటే, మీరెటూ తేలనివ్వరు".

నాయుడు తల గట్టిన యీ పదిహేనేళ్ళయీ ఆ వూర్లో జనం ఎప్పుడూ పెద్దల్ని విమర్శించి ఎరుగరు. ఈ తగవుతో వెనకా ముందూ – మెత్త మెత్తగానే అయినా, నోళ్ళు పారేసుకుంటున్నారు.

దానా దీనా లక్షుంనాయుడుకి కదలక తప్పింది కాదు.

ఒక్క శ్రీరాములు నాయుడు తప్ప తక్కిన పెద్దలంతా చేరారు. రెండు రోజులు ఉదయం, మధ్యాహ్నం నలిగారు, కాని తగువు తెగలేదు.

తెగలేదంటే అభిప్రాయ భేదాలతో చిక్కు వచ్చిందని కాదు. అసలు అభిప్రాయాలే తేలలేదు.

అప్పన్రాముడెందుచేతో పలికించినా మాటాడడు. అతని కొడుకులైనా అందరూ మాటాడరు. వాళ్ళలో నాల్గవవాడు సీతారాముడు మాటాడతాడు. వాళ్ళ బంధువులు ఒకరిద్దరు మాటాడతారు. అప్పన్రాముడి రెండవ కొడుకు అందరికీ వంత పాడతాడు.

వాళ్ళు పది ప్రశ్నలు వేస్తే ఒక జవాబిస్తాడు. పది మాటలంటే ఒక్కటే తిరిగి అంటారు.

వాళ్ళ వ్యవహారమూ ధోరణీ ఎలాగున్నదంటే, కొంచెం నీరున్న గుమ్మిలో తారసపడ్డ బురదమట్టల చందం – అవి చేతికి చిక్కవు. బడితె కందవు. విడిచి పోవడానికి వంటికి బురదయ్యింది.

అప్పు వున్నదా లేదా అంటే తఁవరంతా వున్నదన్నాక లేకెటు బోద్దంటారు. తీరుస్తారా, తీర్చరా అంటే తీర్చకపోతే ఊరుకుంటారా అంటారు. అయితే తీర్చుమంటే మా దగ్గరేటుందంటారు. ఉన్నదానిని గురించి ఎత్తితే మా బతుకేం గావాలంటారు. ఆ తెలివి అప్పు పుచ్చుకున్నప్పుడు లేదా అంటే అప్పుడు తాము చిన్నవాళ్ళట, గ్యానం లేకపోయిందంటారు. అయితే వున్నవాళ్ళే తీరుస్తారు అంటే తీర్పించుకొండంటారు.

విసిగించినకొద్దీ పెద్దలకు కోపాలూ, పట్టుదలలూ బలిసి పోతున్నాయి. అయినా వాళ్ళు దానిని తమాయించుకున్నారు.

"నిజమేనర్రా మీ బతుకులెలాగ అన్న భయం మీకుండడం సహజం. కాని కాలం కర్మం కలసి వచ్చినపుడు ఎవ్వరు చెయ్యగలిగేదీ ఏమీ వుండదు. హరిశ్చంద్రుడంతటి వాడు మీబోటి వాడి దగ్గర కాటికాపరయ్యాడు. ఎందుకు? ఋణం తీర్చడానికే కదా!

... మీరు చెయ్యడం చిన్నతనమైతే మీ పిల్లలున్నారు. వాళ్ళు యింకా చిన్న వాళ్ళు. నలుగురు నలుగురు పెద్ద నాయుళ్ళ యిళ్ళల్లో కంబార్లుగా కుదురుకుంటే ఏదో విధంగా గడవకపోదు. మా పెద్ద నాయుళ్ళం అందరం, ఒక కూలికైనా గొప్పుకైనా ముందు మీ సొంతానికి కబురెట్టాకే యింకోచోటికి కబురెడతాఁవు. ఎందుకింత చెప్తున్నామో ఆలోచించి గ్రహించుకోండి. నలుగుర్లో అవుననిపించుకునే మనుషులకి కూడు పుట్టకపోదు. ఛీ అనిపించుకుంటే బతకడం కష్టం" అన్నారు.

కరణం నాయుళ్ళు కూడా చెప్పగలిగిందంతా చెప్పి చూశారు.

"ఒరే అబ్బాయిలూ! పరపతి చెడిన వాళ్ళు బతకడం కష్టం. నాయుళ్ళు నలుగురూ గౌరవంగా చెపుతున్నప్పుడే మర్యాదగా వినుకోవడం అన్నివిధాల మంచిది. కాదూ కూడదూ అని వెలితిపడ్డారా – కాగల కార్యాలు కాకుండా పోవు. ఈ భృగువు మీద దీన్నిలా పోనిస్తే మీకో సుళువు చెప్తాం.

నూతుల చెరువు ఎగువను, పోతినాయుడు అయిదెకరాలు బంజరు వరకట్టాడు. దానికిపైని యింకో అయిదెకరాలు వరకట్టనిది ఉంది. అది కూడా తన పేరనే ఉందని అతడు దబాయిస్తూ ఉంటాడు. అతను అప్లికేషను పెట్టడం అది శాంక్షను కాకపోవడం ఆ కథంతా వేరే వుంది. ఏమైనా అతన్ని ఒప్పించే పూచీ పెద్దలది. మీరది వరకట్టేయండి. మీ పేర పట్టా అయేటట్టు చూచే పూచీ మాది. నాయుడు ఒంటి గాడవడం వల్ల సాగలేక పోతున్నాడు. కాని మీ కుటుంబమైతే దానిలో బంగారమే పండిస్తారు. సందేహం లేదు" అన్నారు.

అయినా రాముడి కొడుకులకివేవీ రుచించినట్టు లేదు.

"మా వోళ్ళ నోళ్ళే నాలుక్కొట్టి మా పిల్లలు నోళ్ళు మూస్తాఁవంటారు. దానిమీద ఆళ్ళు వుసురు మాకైనా తగుల్తాది; మాది ఆళ్ళకైనా తగుల్తాది. కాకపోతే మాఁవూ మాఁవూ పిలకలట్టుకుని యిడిపించమని మీ పాదాల మీద పడాల" అన్నాడు బోడిగాడు.

"బాబయ్యా, ఆ బంజరు బంగారఁవే పండుతాదో యెండో పండుతాదో ఆ సంగతటుంచండి. దాని మదుపులకి డబ్బులేదు. ఆ మదువులకి మళ్ళా అప్పుసెయ్యాల. అది బంగారం పండే నాటికి ఆ అప్పు వడ్డీలతో పెరిగి దానికి

సరిపడా నిండుకుంటాది. కష్టపడ్డం మావొంతు. అనుబగించడం అప్పిచ్చినోడొంతు. నానొక మాట సెపతాను. ఆ బంజరేదో గోపన్నబాబుకే ఇప్పించండి. ఆ అప్పు తీరిందాక మాం అక్కడ కూలికుంటాం" అన్నాడు సీతారాముడు.

అక్కడికి తగువు తీర్చవచ్చిన పెద్దలకది తమచేత తీరే తగువు కాదని తేలిపోయింది. పదిహేనేళ్ళ క్రితమైతే ఆ తగువు తీర్చడానికింత సేపా! ఈ శ్రీరాములు నాయుడు వచ్చి అంతా మార్చేశారు. ఈయన అన్నింటికీ శాంతేనంటారు. అవతలవాళ్ళకి నచ్చచెప్పడం చేతకాక, నీ మీద నీకొచ్చిన కోపాన్ని, వాళ్ళ మీద కోపంగా భావించి, దానిని ప్రదర్శించడం వల్ల కార్యాలు సానుకూల పడవంటాడు. జనం చేసిన తప్పులు మనం కూడదీసుకోవచ్చు. కాని మనమే తప్పులు చేస్తే – మనం కూడదీసుకోలేమంటాడు. వాళ్ళకి ఎటూ తోచలేదు.

తగువు వాయిదాపడి పెద్దలు లేచిపోయాక దారిలో లక్షుంనాయుడు పట్టలేని తన కోపం వెళ్ళగక్కేశాడు.

"ఈ తప్పంతా మా బావది. ఆయనకి నోరు పెట్టుకు బతకడం చాతనౌను. కాబట్టి అందరూ నోరు పెట్టుకునే బతకాలంటాడు. లేకపోతే యిన్నికబుర్లు చెప్పడానికి ఆ యధవల్ది గుండా చెరువా," అన్నాడు మండే కళ్ళతో.

పక్కల్నీ ముందూ నడుస్తున్న వాళ్ళు, నాయుడి వంక తిరిగి చూశారు. షావుకారు సూర్యం అతని భుజం మీద చెయ్యేసి కొంత దూరం నడిచాడు. ఆ తరువాత చెయ్యి తీసేశాడు. దాని అర్థం అంత తొందర పడవద్దని కాదు, అది స్థలం కాదని.

ఇదంతా ఆ ముందు రోజు జరిగింది. ఆ మధ్యాహ్నం సూర్యంగారు విశాఖపట్నం వెళ్ళేరు.

పదిన్నర గంటలకి పంచాయతీ మండపం జనంతో నిండిపోయింది.

ఆ మండపం వూరికి నడిబొడ్డున ఖాళీ జాగాకుత్తరంగా అక్కడున్న దేవాలయానికెదురుగా తలుపులన్నీ తెరిస్తే దేవుడు కనిపించేటట్టు కట్టారు. ఉత్తరదిశని గోడ, చుట్టూ తెరిపిగా ఉంటుంది.

పెద్దలు మండపం నడిమి భాగంలో కూర్చున్నారు. వారి చుట్టూ మండపం మెట్లమీదా, మండపం నీడలో, మండపం ముందూ, దగ్గరగా దూరంగా వున్న అరుగులపై, చూరు పంచల నీడల్లో, ఆ ప్రాంతాల వున్న రెండు టీకొట్లలో, కిళ్ళీ కొట్టు ముందు పందిట్లో తక్కిన వారంతా కూర్చునీ, నిలుచునీ, చేరబడీ సభా ప్రారంభానికెదురు చూస్తున్నారు.

శ్రీరాములునాయుడూ, సూర్యం గారూ ఉదయం బస్సులో వచ్చిన వార్త వూరల్లా తెలిసింది. అందుచేత ఆనాడు ఎన్నడూ రానంత మంది వచ్చారు.

నాయుడు అనుకున్న వేళకొక్క నిమిషమైనా ఆలస్యం చేయలేదు. జనం కొందరు అరుగుల మీంచి దిగి నమస్కారాలు చేస్తున్నారు. మరి కొందరు చుట్టలు పట్టుకొన్న చేతులు వెనక్కు ముడుస్తున్నారు. మండపంలో పెద్దలు అతడి రాకను గ్రహించేలోగానే చిరునవ్వుతో నమస్కరించి, నమస్కారాలు అందుకుంటూ, నాయుడు చరచరా మండపంలో ప్రవేశించాడు.

నాయుడు పేరు మాత్రమే విని నాయుడ్ని ఎరగని వారు అతనెంత భారీ మనిషో అనుకుంటారు. సన్నగా వింటి కొయ్యలాగ ఆరడుగుల పొడవున, ఎప్పుడూ తెల్లని మల్లెపూల వంటిపల్చని కంటిమెడ లాల్చీల్లో, దట్టమైన వంకీల జుట్టూ, చెదరని నిండైన చిరునవ్వులతో, చామనఛాయగా వుంటాడతను.

పేరు పేరు వరసల నమస్కారాలు చెప్పి నాయుడు తనకు నిర్దిష్టమైన స్థలంలో కూర్చున్నాడు. చుట్టూ వున్న వాళ్ళు చెప్పే మాటలు వింటూనే, జవాబులిస్తూనే, సభనంతట్నీ కలియ జూస్తున్నాడు.

ఉండవలసిన పెద్దలంతా ఉన్నారక్కడ.

లక్షుంనాయుడూ, సూర్యంగారూ అతనికి కుడివైపునా, ఎడమవైపునా వున్నారు. పంచాయితీ సభ్యుల్లో మిగిలిన వారు కొందరటూ, కొందరిటూగా కూర్చున్నారు. మునసబు కరణాలు, నాయుడు రాక ముందా వూరు నేలిన రాఘవయ్య పంతులుగారి పెద్దబ్బాయీ, హాజరుగా వున్నారు. నిన్నా మొన్నా తలెత్తుతున్న మహేశం, పాపయ్యలూ, చాలాకాలం క్రితమే పెద్దల పంక్తిన చేరిన ముసలయ్యా వచ్చేరు.

వీధి వీధి నుంచి, కులం కులం నుంచీ, అన్ని వృత్తులకూ తరగతులకూ చెందిన వాళ్ళను, పెద్ద పెద్ద తగువులతో ప్రత్యేకంగా పిలిపిస్తుంటారు. వాళ్ళంతా వచ్చినట్టే.

నాయుడు చూపులు అప్పల్రాముడి మీద నిలిచేయి.

అతను మండపం మెట్ల ముందు, ఎప్పుడూ కూర్చునే చోటుకు కాస్త ఎడంగా కూర్చున్నాడు. అతనికి డెబ్భై ఏళ్ళపై నుంటాయి. కాని మట్టిని చీల్చుకు బతికే మనిషవడం వల్ల, ముసలితనం అధికారం తల మీది వెంట్రుకల పైనేగాని, శరీరం మీద చెల్లుబడి కావడం లేదు. శరీరం కొంచెం ముడతలు పడ్డా యీనాటికీ అది ఎండలో తళతళ మెరుస్తుంది. అతడొక పెద్ద గావంచా కట్టుకొని ఒక మాసిన చింకి గుడ్డ భుజాన వేసుకున్నాడు.

అతనికి దగ్గర్లోనూ, ఎడంగానూ, ఏభై ఇరవైయేళ్ళ మధ్య వయస్కులు – కొడుకులూ, మనవల్లో పెద్దవాళ్ళూ, వాళ్ళ చుట్టపక్కాలూ, పేటవాళ్ళూ గుంపుగానూ చెదురువాటుగానూ కూర్చున్నారు.

సీతారాంవుడు వాళ్ళందరికీ వెనకగ్గా కూర్చున్నాడు. వాడికోవంక వాళ్ళ పెద్దన్న పెద్దకొడుకు, చిన్నప్పల్రాముడు – దగ్గరగా కూర్చున్నాడు. రెండో వంక రెండో అన్న, బోడిగాడు కూర్చున్నాడు.

ఆ ముగ్గుర్నీ అంటిపెట్టుకొని వాళ్ళింటి ఆడంగులున్నారు. వాళ్ళంతా తమ మధ్య చిన్న చిన్న పిల్లల్ని పెట్టుకొని ఆ ఎండలో నుంచున్నారు. తెల్లని ఎండ నీడలు నల్లని మూర్తులపై మెరుస్తుండగా, వారు ఆరుబయట పూజలందుకునే గ్రామదేవతల విగ్రహాల్లా వున్నారు.

మండపంలో కూర్చున్న గోపన్న వెంట మంది ఎవ్వరూ లేరు. ఆయనకీ నలుగురు కొడుకులున్నా, వాళ్ళంతా పొట్ట చేతపట్టుకొని తలా ఓ దేశం పోయేరు. దిక్కులేని ఓ విధవ కూతుర్నీ, ఆమె ఐదుగురు పిల్లల్నీ పెట్టుకొని గోపన్న ఒక్కడే ఆ వూళ్ళో వున్నాడు.

శ్రీరాములు నాయుడు, పక్కలనున్న వారిచేత అవుననిపించుకుని గొంతుపెంచి–

“సభవారంతా ఒక్క క్షణం నిశ్శబ్దంగా వుండాలి. ప్రారంభించే ముందు మీకందరికీ రెండు విషయాలు మనవి చేసుకోవాలి” అన్నాడు.

నాయుడు సభలు నిర్వహించే పద్ధతి కొత్తవాళ్ళకి కొంత చిత్రంగా కనిపిస్తుంది. అతను సంకోచిస్తున్న ధోరణిలో కొంచెంసేపు కిందికి చూసి తలెత్తి నవ్వుతూ అన్నాడు.

“నన్ను నేను “మ్లాణ”పరచుకొని మిమ్మల్ని “మ్లాణ” పరుస్తున్నానేమో – తెలీదు. నేను పొరబడి వుండవచ్చు. లేక నాకు భోగట్టా చెప్పిన వ్యక్తులు అపార్థం చేసుకొని వుండవచ్చు. ఏమైనా నేను విన్నదేమంటే ఈ సభకు ఇవాళటి వరకూ నేను రాలేకపోవడం గురించి కొన్ని అపోహలు బయలుదేరాయి.

అందుకు తగిన ఆధారం వున్నదా, లేదా అన్న విషయం అటుంచి – నేనా విషయమై మీకందరికి క్షమాపణ చెప్పుకుంటున్నాను”.

నాయుడు నవ్వుతూనే చేతులు జోడించేడు; నవ్వుతూనే ఆ మాటలన్నాడు. కాని జనాల హృదయాలు తుళ్ళిపడ్డాయి. దానిని కప్పిపుచ్చుకోవడానికి వారు “ఛా ఛా, అదేం మాట” అనీ “ఎవరో బుద్ధి తక్కువ వాళ్ళు ఏదైనా అన్నారేమో”నని “అబ్బే, అలాటివన్నీ పట్టించుకోకండని తలకో విధంగానూ చెప్పేరు. నాయుడు ఆ మాటలు వినీ, వినిపించుకోకుండా చెప్పుకపోతున్నాడు.

“నిజానికి తగిన కారణం వుంది. అది నా వ్యక్తిగత జీవితానికి – అంటే నా సొంతానికి సంబంధించిన విషయం. అది యీ సభలో చెప్పడానికి కుదరదు”

నాయుడు తన ప్రైవేటు జీవితాన్ని సభలలో ప్రచారం చేసుకునే రకంకాదు.

“–ప్రతి మనిషికీ సంఘంలో బాధ్యతలతో పాటు సొంత జీవితం కూడా కొంత వుంటుంది. ఈ రెంటికీ సంబంధించిన పనులూ ఏకకాలంలో తగుల్తాయి. ఏది ముందు, ఏది వెనుకన్నది తేల్చడం కష్టమైపోతుంది.

ఇలాంటి సంఘర్షణల్లో – అంటే లడాయిల్లో – దేనికి ప్రాధాన్యత యివ్వడమనేది మన పూర్వులు ఏనాడో తేల్చేశారు. “ప్రజాభిమానమా: సీతాదేవా! ఎవరు నీకు ముఖ్యం?” అంటే ఆ శ్రీరామచంద్రుడు తడవుకోకుండా జవాబిచ్చేడు. కాని శ్రీరాములు నాయుడు శుద్ధ మానవమాత్రుడు. అతణ్ణి మీరు క్షమించాలి” అన్నాడు గొంతు తగ్గించి.

జనాల హృదయాల్లో వారి తొందరపాటుకి పశ్చాత్తాపాలు ప్రారంభమయేయి.

నాయుడి కుటుంబ జీవితాన్ని ఎరగని వాళ్ళు ఆ వూరివాళ్ళల్లో ఎవ్వరూ వుండరు.

అతడు అతి సామాన్యమైన కుటుంబంలో పుట్టేడు. వాళ్ళకన్నా వాళ్ళ మేనమామలు కొంచెం కలిగిన వారు. అతనికి ఎనిమిదో ఏట, పెద్ద మేనమామ – యిప్పుడు జబ్బులో వున్నాయన – కూతుర్ని రెండేళ్ళ పిల్లను, ఇచ్చి పెండ్లి చేశారు. ఆ తరువాత వాళ్ళ మేనమామలకు సిరి బాగా అందుకుంది.

ప్రాథమిక విద్యైనా సరిగా ముగించని నాయుణ్ణి వారు పట్నం పట్టుకెళ్ళారు. హైస్కూలు చదువు ముగిసేక నాయుడు కాలేజీలో చేరేడు. బి.యల్. చదువుతూ దేశ సేవ పేరుచెప్పి చదవనన్నాడు.

అప్పట్లో వాళ్ళకూ వీళ్ళకూ సంబంధాలు కూడా తెగిపోతాయనుకున్నారు. కాని ఆడవాళ్ళ అభిమానాలు గట్టివి. అవి నిలిచిపోయేయి.

ఇప్పటికీ ఆ రెండు కుటుంబాల మధ్యా కొంత రభస ఉంది. నాయుణ్ణి ఓ ఎం.పి. కనీసం ఎమ్మెల్యేనైనా చేయాలని మేనమామల ఉద్దేశం. నాకు పదవులు వద్దు, నా గ్రామానికి నేనేమైనా చేయగలిగితే నాకదే పదివేలు – అంటాడు నాయుడు.

ఈ కొత్త ఘర్షణలో మళ్ళా కొంతకాలం ఎడమొహాలూ, పెడమొహాలూ అయేయి.

తరువాత మళ్ళా కలుస్తున్నారు. ఇంతలో యీ జబ్బు. నాయుడు రాలేకపోయేడంటే అది అర్థం చేసుకోలేని జనంది తప్పు.

నాయుడు చెపుతున్నాడు.

''అయితే ఈ సందర్భంలో ఇంకొక్క విషయం బయటపడింది. అది మనమంతా గమనించతగ్గది. ముఖ్యంగా గుర్తు పెట్టుకుని ముందు ముందు పరిష్కరించవలసింది.

ఒక వ్యక్తి తక్కువైనంత మాత్రాన మన సంస్థ నిర్వహించవలసిన కార్యాలు స్తంభించి పోయేయంటే అది చాలా చిక్కు విషయం. ఈనాడు యిక్కడ మన యీ కార్యక్రమమంతా ఒక్క శ్రీరాములు నాయుడు మీదే ఆధారపడినట్టు మీరు వ్యవహరించినా, లోకం అర్థం చేసుకున్నా, నాకు చాలా కష్టం వేస్తుంది. ఈ పది పదిహేనేళ్ళుగా ఏ పనీ, ఏనాడూ నే నొక్కణ్ణీ చేయలేదు. ఇంకా మీరు మీ బాధ్యతలను ఆసక్తితో నిర్వహించలేక పోతున్నారంటే నేనెవరిని నెపపెట్టాలో తెలియడం లేదు. బహుశ అది నా లోపమే అయ్యుండాలి.

ఇందుకు నా మనస్సు నిజంగా విలవిలలాడిపోతోంది".

నాయుడి మొహంమీద ఆ విలవిలలు నిజంగానే కనుపిస్తున్నాయి. నాయకత్వం విషయంలో నాయుడి ఆదర్శాలు వున్నతమైనవి. ఈ విషయంలో మహాత్ముని బోధలు అతనికి చిన్ననాటే వంటబట్టాయి.

హైస్కూలు తరగతులు చదువుతూ ఒకసారి "ఉన్నవూరూ – కన్నతల్లి" అన్న శీర్షిక మీద వ్యాసం రాసి బంగారు పతకం పొందేడు నాయుడు. అతడి హృదయంలో మొట్టమొదటి వెలుగురేఖ ఆనాడు కనిపించింది.

కాలేజీలో చేరాక దానినతను ఒక జ్యోతిగా సంతరించుకున్నాడు. ఆ తరువాత లా కాలేజీ.

అది పందొమ్మిది వందల నలభైయ్యేడు. లా కాలేజీ మేగజైన్‌లో "భారతదేశం – పందొమ్మిది వందల అరవై" అన్న శీర్షికతో నాయుడు రాసిన వ్యాసం వెలువడింది. పాఠకుల పైన దాని ప్రభావం రచయితను పొగడ్డంతో అంతమయినా, క్రియాశీలియైన రచయితపై దాని ప్రభావం, అతనిని స్వగ్రామానికి చేర్చింది. ఆరోజుల్లో అతనిలానే దేశభక్తితో ఉగ్రూతలూగిపోతూ వచ్చిన తోటి యువకులు తీరిగ్గా "లా"లు పాసై ఈనాడు శాసనసభలూ, మంత్రి మండలులూ అలంకరిస్తున్నారు.

నాయకత్వాన్ని గూర్చి మహాత్ముడేమన్నాడో విశదీకరించి నాయుడు ప్రస్తుతాంశానికి వస్తూ అన్నాడు.

"–ఈ తగవు యీనాటిదీ నిన్నటిదీ కాదు. కాని ఈనాడు దీనికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఏర్పడింది. యేనాడూ యే తగువుకూ రానంతమంది ఈ తగువుకి రావడమే అందుకు నిదర్శనం.

ఈ తగువును గూర్చిన బోగట్టా చుట్టుప్రక్కల గ్రామాలకు కూడా పాకింది. అంటే మనం న్యాయ విచారణ విషయంలో ఇంతకుముందుకన్నా శ్రద్ధగా వుండాలి. పూర్వం లేమని కాదు – విమర్శలకు అవకాశం వుండరాదని నా వుద్దేశం.

ఆ తరవాత–

మనచుట్టూ వున్న ఆ చిన్న పిల్లల్ని చూడండి! (అని వాళ్ళ వంక చూపుతూ) – ఈ తగవు మనం ఎలా తీరుస్తామా అన్న ఆసక్తితో తెలుసుకోవడానికి వచ్చేరు. వారికి బోధపడదనుకోండి. వాళ్ళే ముందు తరాలలో కాబోయే తీర్పరులు. మనం యీనాడు ఇచ్చే తీర్పులే వాళ్ళకు వరవళ్ళవుతాయి. కాబట్టి ఆ విషయం కూడా గుర్తుంచుకోండి".

అని – చివరిదైనా చిన్నది మాత్రం కాదంటూ ఇంకో సంగతి చెప్పేడు.

"మనం పన్నెండేళ్ళ క్రితం పవిత్రమైన యీ దేవాలయం ముందు అంతకన్నా పవిత్రమైన యీ మండపం తెరిచే సందర్భంలో ఒక ప్రతిజ్ఞ తీసుకున్నాం!

... ఇంక నుండి ఈ మండపమే మన న్యాయ మండపం. యీ మండపమున్నంత కాలం, న్యాయం కోసం మనం పరాయి వూళ్ళకి పోరాదు. ఏనాడైతే యీ మండపంలో న్యాయం దొరక్క, దాని కోసం యీ వూరి వాడు పైవూరు పోతాడో, ఆనాడు – దీన్ని కట్టిన మనం యీ చేతులతోనే, దీన్ని కూల్చివేతాం అనుకున్నాం.

ఈ ప్రతిజ్ఞ బాగా గుర్తుంచుకోండి. ఈనాడు సుందరపాలెం సాటి గ్రామాల్లో బోరవిరుచుకొని తిరుగుతోందంటే అందుకు మన ఐకమత్యమే కారణం. నిన్నా, మొన్నా మంత్రులూ, ముఖ్యమంత్రులూ మిమ్మల్ని దర్శించడానికి వచ్చారంటే మాటల్లో, చేతల్లో, ఆదర్శాలలో మీ పవిత్రతే దానికి కారణం. పోటీలలో పాల్గొని దానికవసరమైన ఆశ్రయింపులూ, ఆవేశాలూ ఎత్తుగడల్లో పడటం మనకిష్టం లేకగాని, లేదంటే ఆదర్శ పంచాయతీ బహుమతి మనం అందుకోలేనిది కాదు.

ఆదర్శం క్రియల్లో కనిపించాలి. బహుమతులందుకోవడానికీ, అందుకోక పోవడానికీ కారణాలు అనేకం వుంటాయి. ఈవిధంగా మన యీ ప్రతిష్టను కూడా గుర్తుచేసి, యింక విచారణను ప్రారంభించ వలసిందిగా మిమ్ము ప్రార్థిస్తున్నాను".

అంటూ నాయుడు ముగించాడు.

శ్రీరాములు నాయుడు ఎప్పుడు ఉపన్యసించి విడిచినా అందరి వూపిరితిత్తుల నుండి ఒక దీర్ఘ నిశ్వాసం బయట పడుతుంది. అంతవరకూ చెక్కిన చిత్తరువుల్లా వుండే జనం అప్పుడే ప్రాణం పోసుకుంటున్న బొమ్మల్లా కదులుతారు.

ఆ తరవాత గోపన్న నిలబడి సభకు తను చెప్పుకోవలసేది చెపుతున్నాడు.

నన్నగా ఆరంభించి జనం తమలో తాము వూసులేసుకొంటున్నారు.

ఈ తగవుని గురించి యిరుగుపొరుగు గ్రామాల్లో కూడా వాదవివాదాలు జరుగుతుండడం నిజమే. అసలక్కణ్నుండే యీ తగువుకు వత్తాసూ, నాయుడు మీద లేనిపోని అనుమానాలు దిగుమతి అవుతున్నాయి.

అప్పల్రాముడు పంచాయితీ పెద్దల్లో ఒకడవడం, ఆదినుండీ నాయుడికీ, అతడికీ వుండే దోస్తీ – ఎత్తిచూపి, నాయుడే తగువు తీర్చడమైతే గోపన్నకు న్యాయం దొరకదంటున్నారు. లక్షుంనాయుడు “లా” చదవకపోయినా, సంప్రదాయాలెరిగిన నాయుడు బిడ్డ. వాళ్ళ తాత తండ్రుల కాలం నుంచి ఆ వూరిలో వాళ్ళు న్యాయం చెపుతూ వచ్చిన మనుషులు. ఈ తగువుతో వాళ్లిద్దరికీ చీలికలు రావడం తప్పదంటున్నారు.

ఆ వూరును చూస్తే కన్నెర్ర ఇరుగు పొరుగు గ్రామాలకి చాలా కాలంబట్టే వుంది. వాళ్ళంటారు–

ఒకప్పుడా వూళ్ళో దెయ్యాలు తారట్లాడేవి. పట్టపగలు హత్యలు చేసి పట్టుబడకుండా కట్టుగా వుండే జనమని ఉద్యోగులు ఆ మారుమూల గ్రామానికి ఒంటరిగా వెళ్ళడానికే జంకేవారు. నేడా వూరు ప్రభుత్వోద్యోగుల ముద్దుబిడ్డయి కూర్చుంది. ఉద్యోగులు, రాత్రింబవళ్ళు జీపులమీదా, కార్లమీదా ఆ గ్రామానికి వచ్చిపోతూ అభివృద్ధి పథకాలలో ఏదైనా ఆ గ్రామానికిచ్చాకే తక్కిన వాటి సంగతి ఆలోచిస్తారు.

అలా అని ఏడుస్తారేగాని అందుకెంత యజ్ఞం జరిగిందో, జరుగుతోందో చూడరు.

పదిహేనేళ్ళ క్రితం నాయుడు ఆ వూరు వచ్చిన్నాటికి చుట్టుపట్ల అన్ని గ్రామాల్లానే అదీ నిస్తేజంగా నిర్వీర్యంగా వుండేది.

వూరు వూరంతటికి రెండంటే రెండు గాబోలుండేవి. చిన్న చిన్న కిరాణా కొట్లు. రాత్రుళ్ళు ఇళ్ళల్లో చమురు దీపాలుండేవి. పేదతనంతో ప్రజలు అల్లల్లాడి పోతూండే వారు. మురికి మురికి గుడ్డలూ, మరమ్మత్తులు కోరే యిళ్ళతో, బరువు నిండిన బతుకులు వెళ్ళమార్చుకుంటూ నాగరికతకి దూరంగా ఆ మూలపడి ఉండేవారు.

అలాంటి పరిస్థితిలో నాయుడావూరు వచ్చాడు. అప్పటికతనికి నిండా పాతికేళ్ళు లేవు. నాటికా వూళ్ళో ఐక్యత వుండేది – అనైక్యతా చాలా వుండేది. ఆపదల్లో కలసిపోయినట్టు అవసరాలను సాధించుకోడానికి మనుషులు కలసి వచ్చేవారు కారు. ఎవడి బతుకు వాడిదన్నది ఆనాటి ప్రజల సిద్ధాంతం.

అప్పట్లో నాయుడి మాటలూ, యత్నాలూ, వినీ, చూసీ వెనకా ముందూ నవ్వనివారూ, యద్దేవ చేయనివారూ లేరు. సూర్యంగారి వద్ద నుండి ఒక్కసారి ఇరవై వేలు విరాళం సంపాదించేడని వినగానే జనం ఉలిక్కిపడ్డారు అదీ హైస్కూలు కోసరం.

సూర్యంగారు ఆరోజుల్లో గొప్ప డబ్బు నిక్కచ్చి మనిషి. దాచిపెట్టిన గాబుల్లో ధనమెంత నిలవ వున్నా అందులోంచి దమ్మిడీ కదపడమంటే అతనికి ప్రాణం పోయేది. అలాంటి వాడికి ఏం చెప్పి ఎలా బోధపరచాడో! – అతని మాటల్లో మహాత్మ్యమున్నదనుకొన్నారు జనం.

తరువాత అందరూ అతని మాటలు వినడం ఆరంభించేరు.

సర్వానర్థాలకూ మూలం అజ్ఞానం, అందుచేత ముందు హైస్కూలు రావాలన్నాడు నాయుడు.

జనంకిది సరిగా బోధపడలేదు. అయినా చెప్పినట్టు విన్నారు.

హైస్కూలుంది కాబట్టి రోడ్డు కావాలన్నాడు ప్రభుత్వం వారితో.

ప్రభుత్వం వారికిది సరిగా బోధపడింది.

ఒక విజయాన్ని మరొక విజయానికి నాంది చేసుకుంటూ అతను అభివృద్ధి కార్యక్రమాలన్నీ ముందుకు సాగించుకు పోయాడు. ఈవేళ ఆ గ్రామం తోడి గ్రామాల ఈర్ష్యకు గురౌతున్నదంటే అవుతుంది మరి. ఆఫీసులూ, వగైరాలకు తోడు అక్కడ మూడు కో–ఆపరేటివ్ సంస్థలూ, నాలుగు బట్టల కొట్లూ వున్నాయి. పూరా అరడజను మంది టైలర్లకక్కడ సంవత్సరం పొడుగునా పని వుంటుంది.

గోపన్న యింకా చెపుతూనే ఉన్నాడు.

“– ఆ దెబ్బతో నా వ్యాపారం దెబ్బతినేసింది. నాదే అన్న మాటేంవిటి – చాలా మందిది దెబ్బ తినేసింది. నాది మరీ అధ్వాన్నం!”

అని కొంచెం సేపు ఆగి, చెప్పక తప్పదన్నట్టు చూస్తూ–

“కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. నా కొడుకులే – నా సొంత బిడ్డలు కూడా నన్ను దగా చేశారు. వ్యాపారం దెబ్బతింటుందన్న సడి తెలియగానే గుప్‌చప్పుగా ఎవరికి చేజిక్కింది వాళ్ళు మాయం చేసేరు. దానివల్ల వున్న ఆబోరుకనింతా ముందే బయటపడి వేగం వీధిని పడిపోయాం.

ఆ తరువాత వేరులన్నారు. పంచుకోటానికేం వుంది? అయినా – అందులోనూ కుతంత్రమే. సుళువుగా వసూలయ్యే బాకీలన్నీ వాళ్ళవి. ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించేవి – నావీ, నా పెద్ద కొడుకువీ! ఎగెయ్యడానికి

వీలయ్యేవీ, వడ్డీలు మాఫీలకు ఒప్పుకునేవీ, అప్పులు వాళ్ళు చెల్లిస్తారట. ఇల్లెక్కి కూచునే అప్పులు మమ్మల్ని చెల్లించమన్నారు!

వాళ్ళింతచేసినా, నోటి మంచివాళ్ళంకాబట్టి – ఏదో నలుగురి దయా మా మీద ఉన్నది కాబట్టి, అలాగే కిందబడీ మీదబడీ ఐదారేళ్ళలో రావలసింది రాబట్టుకొని, ఇవ్వవలసిన వాళ్ళకు ఇచ్చుకొని అప్పులు లేవనిపించుకున్నాము.

తరవాత ''నాయనా! ఇక్కడుండ లేనురా! పడవలెల్లిపోతా''నన్నాడు కొడుకు. "పువ్వులమ్మిన వూళ్ళో కట్టెలమ్మడం కష్టం. ఎళ్ళిరా" అన్నాను. బాబూ! ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, నేను తీర్చిన్నాడు, ప్రతీ అప్పూ, అణాపైసలతో వడ్డీలోంచి ఒక్క ఎర్రని ఏగానీ మాఫీ అడక్కుండా ఇచ్చాను. నాకు వచ్చిన్నాటికి నా వడ్డీ అధర్మ వడ్డీ అయిపోయింది. సరే నాకంతే ప్రాప్తమనుకున్నాను; దానిక్కూడా గడువు కావాలన్నారు. తమ దయ అన్నాను; ఇప్పుడా గడువు కూడా పూర్తయ్యింది. ఏలినవారు ఏమిస్తారో, భగవంతుడేమి తమ బుద్ధికి తోపిస్తాడో ఇప్పించండి. అదే మహాప్రసాదమనుకొని పట్టుకుపోతాను".

అంటూ కూర్చోబోయాడు. మళ్లా ఒక విషయం జ్ఞాపకం రాగా నించున్నాడు.

"ఒక్కమాట! ఇందాక తమరో మాట శలవిచ్చారు. న్యాయం దొరకలేదని యీ మండపంలోంచి అడుగు బయటపడ్డ నాడు యీ మండపం కూల్చేస్తాం అన్నారు. నా నుంచి మాత్రం ఎన్నడూ ఆ పని జరగదు.

నిజమే! నిన్న మొన్నటి వరకూ – అరగంట క్రితం తమరా మాట అనేవరకూ కూడా – తప్పీదారీ వస్తే కోర్టుకు వెళ్ళాలనే ఉద్దేశం నాకు లోపల ఉండేది. కాని ఎప్పుడైతే తమరా మాట శలవిచ్చారో అప్పుడా ఉద్దేశం పూర్తిగా విడిచిపెట్టుకున్నాను.

తిండికి లేకపోతే, నేనూ, నా మనవలూ, నా కూతురూ పస్తులుండి మాడిచావనైనా చస్తాము. కాని యిక్కడ న్యాయం దొరకలేదని మిమ్ము నెపపెట్టం. పది కాలాలపాటు యీ న్యాయమండపం వర్ధిల్లి నాకూ నా మనవలకూ కాకపోయినా తక్కిన వారికైనా యిక్కడ న్యాయమన్నది దొరకడమే నా కోరిక".

అంటూ గోపన్న కూర్చుండి పోయాడు.

చివరిలో గోపన్న వూపిన వూపు సభవారి గుండెలు కదిపింది. భగవంతుడు చేసే పరీక్షలు యీలాగున్నాయి. అతడి ఓరిమీ, మంచితనం మీద అతడికుండే విశ్వాసం గమనించిన కొత్తవాళ్ళు కొందరు – "ఇందుకా జనం కీయనమీద యింత అభిమానం" అనుకున్నారు.

కొంతసేపు పోయాక ఒక్కొక్కళ్ళే అప్పల్రాముడి వంక చూడసాగారు. తలవంచుకొని కూర్చున్న అప్పల్రాముడు కదలడు, మెదలడు. సభలోని జనం అటుచూసి ఇటుచూసి శ్రీరాములు కేసి తిరుగుతున్నారు. నాయుడిది గ్రహించి అడిగారు.

"ఏమయ్యా అప్పల్రాముడూ! నువ్వేమంటావ్?" అన్నాడు.

డెబ్బై ఏళ్ళ వయసు మించినా, అప్పల్రాముణ్ణి అందరూ ఒరేయ్ అనే అంటారు. ఒక్క నాయుడే యేమయ్యా అంటాడు.

అప్పల్రాముడు మాటాడలేదు.

మరికొంతసేపు పోయాక అసిరినాయుడన్నాడు.

"అదికాదు రాముడూ; నువు సెప్పవలసిందేదో నువ్వూ సెప్పేసుకోవాల?'' అన్నాడు తల వణికించుకొంటూ. అసిరినాయుడు ఎనభై ఏళ్ళ ముదుసలి. ఎన్నడూ సభల వెంట తిరిగినవాడు కాడు. అప్పల్రాముడి పొలం, అతడి పొలం ప్రక్క ప్రక్కనుంటాయి.

అప్పటికీ రాముడు కదల్లేదు.

ఇంకా కొంతసేపు వూరుకొని వాకిట నుంచున్న జనంలోంచి ఒకాయన అడిగాడు.

"అవున్రా, మమ్మల్నెంత సేపు ఇలా నిలబెడతారు? అనువులనో, మినువులనో, అప్పు ఉన్నదనో లేదనో. ఏదో ఒకటి అనాలిగాని అలాగా మన్నుదిన్న పాముల్లాగా కూకోవడం బాగులేదు. ఇవ్వగలిగితే బాబూ ఇది ఇస్తాంవనాల. లేకపోతే అంతిచ్చుకోలేంవనాల. అదీ ఇదీ కాకపోతే మరివేమివ్వం, మీ యిష్టమొచ్చింది చేసుకోండనాల. అంతేగాని. ఏమాటా అనకుండా కూచోవడం, మీకూ శోబస్కరం కాదు. ఈ తగవు తీర్చవచ్చిన పెద్దలకీ, ఇంకా ఇది చూడ్డానికొచ్చిన మాకూ గౌరవం కాదు" అన్నాడు సానుభూతీ, నిష్ఠూరం జోడిస్తూ.

రాముడుగాని అతని కొడుకులు గాని అప్పటికీ పలక్కపోగా – లక్షుం నాయుడికి బావమరిదీ, శ్రీరాములు నాయుడికి దూరపుబంధువూ అయిన అన్నమయ్య "చచ్చెస్" అనుకుంటూ జనంలోంచి యివతలకి వచ్చి పై మీది తుండుగుడ్డ ఝుణాయిస్తూ, అది ఝుణాయించినట్లే సభనూ, సభలోని పెద్దలనూ ఝుణాయించడం ఆరంభించాడు.

అతడు మాట్లాడుతోంటే సర్వాంగాలతోనూ అభినయం చేస్తాడు. ముఖంలోని ఆరున్నొక్క రంధ్రాలలో నుండి వుద్రేకం బుసలు కొడుతుంది.

"గతిలేని మనుషులు తగవుకెడితే, మతిలేని పెద్దలు తీర్చే వారా – అని సాంవెత చెపుతాడు. మా తాత. యీ యవ్వారం చూడబోతే ఆ చందం తయారయ్యింది. మూడ్రోజులై తగవు

నలుగుతోంది. కాని మాల నాకొడుకు ఒక్కడూ మాటాడడు. ఆల్లని పట్టుకొని యీ పెద్దలంతా అమ్మా బాబూ అని పిసకరిస్తారే గాని "ఏం ఎధవనకొడుకుల్లారా మీకొచ్చిన పోయే కాలం! మీ బాబుగారి సొమ్మా? మీ తాతగారి సొమ్మా? ఇవ్వకెక్కడికి పోతారు. తంతాం!" అని ఒక్కరూ అడగరు. మాకు చేతగాదు పోవయ్యా అని ఆ ముసిలోడితో చెప్పనయినా చెప్పరు. పైగా యీ పెద్దలు కోర్టుల కెవ్వరెల్లకండి; మాదే పెద్ద కోర్టంటారు..."

అంటూ తెరచిన నోరు ముయ్యకుండా దబాయిస్తుంటే అప్పల్రాముడి చుట్టమొకడు లేచి దానికి జవాబు ఆరంభించాడు.

"బాబూ, అన్నమయ్య బాబు! అంత కోపం తెచ్చుకోకు. ఎంత తవరునాయులైనా అంత దురితం తగదు. సదురులోని బాబులెవరూ తంవకన్నా తక్కువ సదవుకోలేదు. ఆ పత్రం కోర్టుకెళ్తే ఏంవౌద్దో తవకు తెలియక పోవచ్చుగాని ఆరికి బాగా తెలుసు. అందుకే ఆరి రాకట యీ పద్ధతి నెల్తాంది. తంవరు తొందరపడకండి" అన్నాడు గట్టిగానే.

దాంతో రభస ఆరంభమయ్యింది.

'రాకటంటే – నీ వుద్దేశం' వేంవిటన్నాడొకాయన.

'తంతాంవంటే తంవరుద్దేశం' వేటన్నాడు జవాబుదారు.

'కోర్టుకెళ్తే దొక్కచించి డోలు కట్టించి మరీ యిప్పిస్తా'రన్నారు కొందరు.

'ఆ... ఆ పప్పులిప్పుడుడక'వన్నారు కొందరు.

ఎంత సొరాజ్జాలొచ్చినా బరిదిగి పొయ్యిందేటి – అంటే; కాదయ్యా! నిలువునా గొంతుకోసీ – అంటున్నాడు వెనకవాడు.

రభస ఈవిధంగా పెరిగిపోతోంది. ఇందులో ఆడామగా తేడాలేదు. సవర్ణులూ ఆవర్ణులూ తగువు కాదు. అప్పులిచ్చే వారూ అప్పులున్న వాళ్ళ తగువది. అప్పల్రాముడూ, గోపన్నల మీద పెట్టి అనేక ధోరణులలో సాగిపోతోంది.

శ్రీరాముల నాయుడు సాధారణంగా ఎట్టి అరాచకాన్నీ సహించడు. ఒక్కొక్కప్పుడు జనం అతని చెయ్యి దాటిపోక తప్పని పరిస్థితి వస్తుంది. అలాంటప్పుడు వాళ్ళను కొంత సేపటి వరకు ఉద్రేకపడనిచ్చి అప్పుడదుపు లోకి తెస్తాడు.

ఈనాడు అప్పల్రాముడాపని చేశాడు. నిశ్శబ్దమైన సభ నడుమ సభ వారి ఎదట నిలుచుని చెపుతున్నాడు.

"బాబయ్యా! మొన్నా, నిన్నా, యీ యేలా, నలిగిన నలుగుల్లను బట్టి సబవోరి వుద్దేశమని నాకనిపించేదేటంటే "నా యన్నాయాల మాట ఎలాగున్నా, మూడేళ్ళ కిందట ముగ్గురు పెద్దమనుషుల ముందు – ఆరి మాట కాదనలేకో, అన్నాయానికి బయపడో, అప్పల్రావుడు అప్పంటూ ఒప్పుకున్నాడు; ఆ ఒప్పుకున్న అప్పు, యీయాలటికి తీరుస్తానని ఆ పెద్దల ముందు మాటిచ్చినాడు; కాబట్టి యీ నాడు ఆడికున్నా లేకపోయినా, ఆడమ్ముడుబోయో ఆడి బూంవులమ్ముడుబోయో సావుకారి ఋణం ఆడు తీర్చేయాలా! అన్నట్టుంది.

సబవోరి కంటికృనిపించేదేటంటే – గోపన్నబాబు కస్టం. ఆ బాబుకీ నలుగురు కొడుకులున్నా ఆయన కొడుకులాయన కాడలేరు. అప్పల్రాముడి కొడుకులందరూ ఆడికాడే ఉన్నారు. ఆల్లంతా ఏనుగ్గున్నల్లా ఉన్నారు. ఆళ్ళకి సెక్కాముక్కా లేకపోయినా ఆళ్ళు రెక్కల కస్టం సేసుకు బతగ్గలరు. ఒక పూట దప్పికలేక పోయినా ఆలపేనాలు పోవు. అందుసేత ఆల్లను యేదో ఓ పద్ధతిని ఒప్పించి ఆల్లకున్న ఆ ఒక్క మడిసెక్కా అమ్మించేసైనా, గోపన్నబాబు అప్పు తీరుమానం సేసేటట్టు సూడాల – అన్నట్టుంది సబవోరి మనసులో మాట.

బాబయ్యా! సబవోరికదే నాయంవనిపించిన్నాడు ఆ నాయవేం యిప్పించండి. నెత్తిమీదెట్టుకుంటాను." అన్నాడు కూర్చుంటూ.

చాలామందికి అంత గొడవ తరువాత అప్పల్రావుడేం చెపుతున్నాడో అర్థం కాలేదు. అందులో మొదటివాడు లక్షుంనాయుడు.

"అంటే – అది తప్పే అయినా తీర్చమనడం తప్పంటావు" అన్నాడు లక్షుంనాయుడు.

రాంవుడీ సవాలుకు జవాబివ్వలేదు. రెండవసారి రెట్టించగా ఇక తప్పక జవాబిచ్చాడు.

"బాబయ్యా! అది అప్పో, అప్పుకాదో, అయితే యేనాటి అప్పో, ఎలా దేలిన అప్పో, అదంతా సదువుకోని మొద్దులం మాకు తెలీదు. పెద్దలు తంవరున్నారు. ఆపైన శ్రీరాంవులు బాబున్నారు. తంవరాలోసించి సెప్పాల" అన్నాడు శాంతంగా.

ఈ మూడు రోజులకూ యీనాడు తేలిన రాముని యీ రాకడ కొందర్ని ఆశ్చర్యపరచింది. శ్రీరాముల నాయుడికి సందేహ నివృత్తి అయింది. కొంతసేపు ఆలోచనలో పడి ఒక నిశ్చయానికి వచ్చినట్టు లేచి నించున్నాడు.

"రాంవుడూ! యీ తగవు నేను తీరుస్తున్నాను" అన్నాడు శ్రీరాములు నాయుడు. అతడి ముఖంమీద ఏ ఉద్రేకమూ కనబడలేదు. "నువ్వు యీనాటి నుండీ గోపన్నగారికి ఒక్క నయాపైసా కూడా బాకీ లేవు. నువ్వు హాయిగా యింటికి పోవచ్చు" అంటూ గోపన్న వంక తిరిగి "గోపన్నగారూ మీరు ఎల్లుండి కనపడండి – మీ నోటు చెల్లుబెడతాను" అన్నాడు శాంతంగా.

"లేవండీ పోదాం" అంటూ తక్కిన వారిని లేపడం ఆరంభించాడు.

ఈ తీర్పేమిటో జనానికి అర్థం కాలేదు. అర్థమయ్యేలోగా అప్ప్రలాముడు లేచి నుంచున్నాడు.

"బాబూ శ్రీరాఁవులు బాబు! నువ్వంత అలగవలసిన మాట నాఁనేవన్నానో నాకు తెల్దం లేదు. నానన్న దాంట్లో తప్పేటుందో సెప్పి ఎల్లిపో" అన్నాడు నిబ్బరంగా.

"నేనలిగి వెళ్ళటం లేదు. ఈ తగువు నువ్వే తీర్చవలసి వస్తే దానిని నువ్వే విధంగా తీర్చి వుందువో ఆ విధంగా దీనిని నేను తీర్చాను. అది నా నోటంట విని నువ్వు అలక అనుకొంటున్నావు. అంటే దానిలోని అసంగతత్వం నువ్వు గ్రహించావన్న మాట".

రాముడికీ మాటలు అర్థం చేసుకోడానికి కొంతసేపు పట్టింది. అప్పటికైనా అతడికా మాటలు పూరా అర్థం కాలేదు. నాయుడి కళ్ళల్లోనూ చూపుల్లోనూ అతడి భావం అవగతమయింది.

నాయుడు లోతు గుండెల్లో లోతులు చూసస్తూ అప్ప్రలాముడు 'నిజమే'! అన్నట్టు విస్తుపోతున్నాడు.

విస్తుపోతూ "సరే! నా తప్పు నాకు తెలిసిందనే ఒప్పుకుంటాను. నీ ఒప్పైన తీర్పేటో సెప్పు" అన్నాడు చివరికి.

"అక్కర్లేదు. ఈ తీర్పు నీకు అసంగతమని తోచినప్పుడు సబబైన తీర్పేదో నువ్వెరిగే ఉంటావు. నువ్విప్పుడు దానిని చెపితే దానినే మనం అమలు చేదాం"

నాయుడి ధోరణి అవగతమైన అప్ప్రలాముడి కీసారి ఆశ్చర్యం కలగలేదు. అతడి మీద ఆనాటికి మొట్టమొదటిసారి కోపం పుడుతుండగా అతడి ముఖంలోకి అట్టే చూస్తూ అన్నాడు.

"బాబయ్యా! నువ్వెంతకైనా సాహసివంటాను" అన్నాడు నెమ్మదిగా. నాయుడికి బోధపడలేదు.

"ఎందుచేతట?"

"ఎంచేతో నీకే తెలుసు" – అని నాయుడి ముఖంలోని మార్పులు గమనిస్తూ "–నీ దెబ్బన్నది తగిలిన సోట కనపడదు. నువ్వేం జేసినా సాపకింద నీరులాగ సల్లగ ముంచుతావు".

రాముడంత మాటకు సాహసిస్తాడని నాయుడెన్నడూ అనుకోలేదు. కనులెర్ర పడనీకుండా అన్నాడు.

"చాపకింద నీరులా చల్లగ ముంచేది నువ్వా నేనా?"

"తఁవరే" అని –

"బాబయ్యా! నువ్వు నాయం సెపుతావని వచ్చిన పెద్దవు. నువ్వు నీ నాయవేఁదో సెప్పాల. అంతేగాని నీ ఏలుతో నీ కన్నే పొడుస్తాను సూడమన్నట్టు నాయఁవడగొచ్చినోరినే నాయం సెప్పమనడం తమ వొంటివోరికి దరమం కాదు" అన్నాడు నిష్కర్షగా.

అప్ప్రలాముడి చేత న్యాయం పలికించడం శ్రీరాములునాయుడి అభిమతంగాని, అతనిచేత ధర్మాలు చెప్పించుకోవడం అతని అభిమతం కాదు. అందుచేత అందుకు తగ్గ జవాబిచ్చాడు.

"నేనెందుకలాగ చేయవలసి వచ్చిందో నీక్కూడా తెలుసును. కాని నువ్వున్న దుఃఖంలో నీకున్న బాధలో నేనది ఇప్పుడు చెప్పినా నువ్వు అంగీకరించవు. అందుచేతనే నా తీర్పలా ఇచ్చాను".

రాముడు అంగీకరించలేదు.

"నువు మళ్ళా మొదటికే వస్తన్నావ్. తగువు సెప్పవొలిసే దొర. తన తగువు సెల్లుద్దా సెల్లదా – ఎదర మనసు నెలాగా తిప్పడమన్నది కాదు సూడవొలిసింది. తను సెప్పే తగవులో నాయమెంత, అన్నాయవెంత – అన్నది ఆ దొర సూపు కావాల. అలాగ సెప్పిన తగవు తీరిననాడు తగువే వుండదు. తీరని నాడు ఆ తప్పు దాన్ని ఇనుకోని జనం దొౌతాది – తనది కాదు".

దానిపై లక్ష్మంనాయుడు చవ్‌న ముందుకు వస్తూ అన్నాడు.

"ఆ మాట ముమ్మాటికీ ఖాయమేనా?"

అతడి ముదలకింపుతో అనవసరంగా రెచ్చిపోతూ అప్ప్రలాముడు గొంతు పెంచి అన్నాడు.

"ఆహా ముమ్మాటికీ!" అని – అంతకన్నా గొంతు పెంచుతూ అన్నాడు.

"బాబూ లచ్చుంనాయుదు! యీ ముండకొడుకు ఇంత కాలానికి చిక్కేడన్నట్టు నువ్వా మాటలన్నావ్! నిజానికి నానెన్నడూ తప్పించుకుపోయింది నేదు. నానా బాబు మాటలకు నాడూ నేడూ కట్టుబడే వున్నాను. ఆ బాబు నోటిమీదగా యిది నాయవైన అప్పేనని ఒక్కపాలి సెప్పించు; అణా పైసలతో ఒక్క ఎర్రని ఏగానీ మాఫీ అడక్కుండా నానీ అప్పంతా తీరుస్తాను. అలా తీర్చన్నాడు యీ మాల యదవ ఓ అమ్మా అబ్బలకు పుట్టలేదు..."

"ఇది అప్పే! అప్పే! అప్పే!!!"

రాముడి వాక్యం పూర్తి కాకముందే శ్రీరాములునాయుడి గొంతు వినిపించింది.

ఆవిధమైన ఉద్రేక ప్రదర్శనవల్ల కలిగిన సిగ్గును దాచుకోడానికి పడే శ్రమతో అది స్వగతమో అపవారింపో, ప్రత్యక్షమో తెలియరాని విధంగా ఆ తరువాత అన్నాడు.

"–వాళ్ళయినా నేనైనా ఇంకొకరైనా దీనిని అప్పుకాదని ఎలా అంటారో – అలా అనగలరని వీళ్ళెలా ఆశిస్తున్నారో నాకు బోధపడటం లేదు –"

నాయుడి మాటలో, ముఖంలో ప్రదర్శితుడౌతున్న శ్రీరాములు నాయుడు – యిన్నాళ్ళుగా, అప్పలాముడర్థం చేసుకొన్న శ్రీరాములు నాయుడికీ – గతరాత్రి తనవారి మాటల్లో అతడికి కనిపించిన శ్రీరాములు నాయుడికీ – సమన్వయమేర్పరుస్తుండగా నాయుడు చెప్పుతున్నాడు.

"–అప్పన్నదీ, తప్పన్నదీ, పాపమన్నదీ ఒకరంటే అయి ఇంకొకరు కావంటే కాకపోవు. మీరు కోర్టుకు వెళ్ళి వాదించి గెల్వవచ్చు. అంతమాత్రాన మీరు ఆ రుణాన్నుండి తప్పించుకోగలరనుకోవడం కల్ల. ఈ జన్మలో కాకపోతే యింకొక జన్మలోనైనా మీరు దాన్ని తీర్చడం తప్పదు" అంటూ విసుగు నింపుకొన్న ముఖంతో వెళ్ళి కూర్చున్నాడు. తక్కిన వాళ్ళు కూడా తమ స్థలాల్లో కూర్చున్నారు.

క్షణకాలం సభ చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దమయింది.

కొంతసేపు వూరుకొని శ్రీరాములునాయుడు ముందుకు వంగి పక్కకు తిరిగి వున్న అప్పలాముణ్ణుద్దేశించి–

"మీరు ప్రస్తుత పరిస్థితిలో తీర్చలేరనే – " అనబోగా అప్పలాముడు చప్పున ముందుకు తిరిగి–

"బాబ్బాబూ శ్రీరావులు బాబూ! నువ్వింక శ్రవపడకు. నువ్వేం సెపతావో నాకు తెలుసును. ఎందుకు సెపతావో కూడా నాకు తెలుసును. ఒకసారి తీర్పిచ్చేసినాక నీ తీరుపుమీద నువు నిలబడు. నా మాటమీద నాన్నిలబడతాను. నువ్వెందుకా తీర్పిచ్చినావని నా నడగనేదు".

ఇలా అని మతిబోయిన, యర్రదనం నిండిన , ముఖంతో కర్తవ్యాన్ని వెదుక్కుని ముసలయ్య వంక తిరుగుతూ అన్నాడు.

"బాబూ ముసలయ్యబాబు! నా రెండెకరాల ముప్పై సెంట్ల బూవికీ ఏవిస్తావో నీ దయ. యిప్పించు".

అప్పలాముడు దోసిలి పట్టాడు.

మూడు రోజులుగా బయాణా మొలలో పెట్టుక తిరుగుతున్న ముసలయ్య అప్పలాముడి మొహంలోకి చూసి తల దించేసుకున్నాడు. అది గ్రహించి అప్పలాముడన్నాడు.

"బాబయ్యా! నువ్వు జంకక్కరనేదు. నా బొందిల పేనం వుండగా నీ డబ్బుకి మొప్పం రాదు. నాను పోయినా నీ డబ్బుకి తకరారుండదు".

ఆ మాటతో ముసలయ్య సందేహం నివృత్తి అవాలి. కాని ఐనట్టు కన్పించలేదు.

"నీ అనుమానవేటో సెప్పు. ఒకయేల నా నసురుసురు మంటున్నా ననుకుంటున్నావేవో – అదేం నేదు. నాను సంతోసంగ అమ్ముతున్నాను. నువ్వూ సంతోసంగ నీకేం తోస్తే అదిప్పించు".

ఈ ప్రకటనతో ముసలయ్య అడ్డంకులు తీరినట్టు కనపడ్డాడు. అప్పుడు కరణంకేసి తిరిగి అప్పలాముడు పత్రం రాయమన్నాడు.

కరణం కలంలోంచి, పురోణీ పత్రం పుదుతూండగా, జనం గొంతుల్లేని కొయ్యబొమ్మల్లా కొంతసేపు కూర్చున్నారు. తరువాత ఒకరొకరే గొణుగుడు ఆరంభించారు. కొందరు కొందరు గంటులు పట్టిన కాళ్ళను వూచుకుంటూ బయటికి పోయి మాటాడుతున్నారు.

"అప్పుకి గడువిప్పించమంటే ఇప్పించగలిగాడు గాని అసలప్పే లేదనమంటే అనగలడా ఎంత దరమ రాజైనా!" అన్నాడో పెద్దమనిషి.

అతడు రహస్యంలా మాటాడినా పక్కవాడు జవాబిచ్చాడు.

"పోనీ అలా అంటారనే కట్టు. అసలా గోపన్న ఏం బలిసున్నాడని"

"బలిసుంటే అంటావేటి?"

"అనరయ్యా! బూవీ, పుట్రా, ఇల్లూ, వాకిలీ అన్నీ వొదేసుకుని బికారోణ్ణి చేసేయండి. మీ సావుకోర్లు దివాలాలు తీసినప్పుడు మీ కప్పులిచ్చినోళ్ళు అలాగే చేశారేటి?"

వాదన్లు మళ్ళా పుంజుకుంటున్నాయి.

రాముడి చెవికందుబాటులో జోగెప్పడు అంటున్నాడు. అతడు జోడెద్దులూ, ఓ బండి పెట్టుకొని వాటిని బాడుగలకు తిప్పుతూ కాలక్షేపం చేసేవాడు. అంతకు పూర్వం అతడికీ కొంత పొలం ఉండేది.

"చూడబోతే పాతిక ముప్పై మందున్న కుటుంబం! ఎంత కూలి సేసుకు బతికే జాతైనా ఓ నెల్లాళ్ళు పస్లు కెటాముటీ ఒచ్చిందంటే ముసలీ ముతగాతో పిల్లలు కిరకిర సుట్టుకుపోతారు. ఆ అనుబగంవేటో నే నెరుగుదును. అంతా ఆ నారాయణమూర్తి దయ".

"అంతే మరి" – ఏండ్లు మీరిన చాకలొకడు ఎలుగురాసిన గొంతుతో అంటున్నాడు. "నరుడు తెచ్చిన సిక్కిప్పొచ్చు. నారాయనుడు తెచ్చింది ఇప్పలేం. లేకపోతే – యెంతటి గోపన్న బాబేగతికొచ్చాడు. ఏలాటి అప్పలావుడే కాడి కొచ్చాడు. ఆ లిద్దరి మద్దే తగువు – దాన్ని దీర్చడానికిందరు జనం".

మరి కొందరు–

మాలల "స్వాసలు" గురించీ, ఏలేవాడు ఇస్తున్న అలుసు గురించీ, నసించిపోతున్న ప్రజల పాపభీతి గురించీ వ్యాఖ్యానిస్తున్నారు.

కరణం పురోణిపత్రం పూర్తిచేసి శ్రీరాములునాయుడుకేసి చూశాడు. నాయుడు మడగాళ్ళపై తలవంచుకొని

కూర్చున్నాడు. విడబోయిన కరణం నోరు, సూర్యం చూపులతో చూపులు కలియడం వల్ల, అర్థాంతరంగా మూసుకుపోయింది.

అతడు రాముణ్ణి పిలిచి పత్రం చదివి వినిపించాడు. చదవగా విన్నాను సరిగా వున్నదనిపించాడు. నిశానీలు పెట్టవలసిన చోట్లు చూపించి కాగితంవూ తమ్మార్కు పెట్టే అతని ముందుంచాడు.

అప్పలరాముడు ఆ పత్రం చేతిలోకి తీసుకొని మండపం మధ్య కూర్చున్న శ్రీరాములుకేసి చూస్తూ అన్నాడు.

"బాబూ శ్రీరాంవులు బాబు! నువ్వలా కించపడకు. నిన్నొకమాట తూలాను. కాని, కావాలని అన్నది కాదు. ఆ మైకంలో ఆ మాటలాగొచ్చింది. దానికింకోలా గనుకోకు.

నువు సదువుకున్న వోడివి. సమస్తం ఎరిగుంటావనే అనుకున్నాను. నీకూ నిజం తెలిసుండదన్న సంగతి నాకు తెలిసింది కాదు. తెలిస్తే నువ్వంత నిబ్బరంగ నువ్వన్నమాటలనవు. నానూ ఆ మాట అలా తూలకపోదును.

బాబూ! నీదేవుంది? ఈ మట్టిలో పుట్టి యీ మట్టిలో పెరిగినోళ్ళం. మా బతుకంత యిక్కడే గడసింది. మాకే తెలీనేదు. నామట్టుకు నాకు నిన్నరేత్తిరి దాకా తెలియనేదు.

బాబయ్యా! యీ తగువులో నిజానిజాలెట్టివో, ఇది నాయంవైన అప్పుకాదని నానెందుకనుకున్నానో, అప్పలరాంవుడి కప్పు లెగవేతాం అన్న దుర్బుద్ధి ఎప్పుడు బుట్టిందో, ఎందుకు బుట్టిందో, ఎలాగ బుట్టిందో, ఆ కథంతా తంవరికి సెప్పి అప్పుడే దీనిమీద ఏలుముద్ర ఎడతాను. తంవరంతా కొంచంసేపు ఓర్చాల."

అంటూ జనంకేసి తిరిగి–

"బాబయ్యల్లారా! మాల మాదిగలకీ, కూలినాలి జనాలకీ, ఒకరి సొమ్ము బడేనుకుందాంవన్న సోసేగాని, నాయాన్నాయాల ఆలోచన లుండవని తంవరంత అంటున్నారు. ఆలకి కూడుబుట్టక పోడానికి – కారనంవదే అంటున్నారు తంవరు.

నరుడు తెచ్చుకొన్న సిక్కుకి యిరుగుడుంది. కాని నారాయనుడు తెచ్చిన్దానికి ఎదురు లేదంటున్నారు – ఇందాక ఎవురో. బాబయ్యా! యిది నరుడు తెచ్చిన ముప్పో నారాయనుడు పెడుతున్న సిక్కో తంవరే సిత్తగించండి"

అంటూ దూరాన అరుగులమీద వున్న వారిక్కూడా వినబడేందుకు వెనక్కి కొంత జరిగాడు. నడినెత్తి నున్న పొద్దు పడమటకు వాలుతుండగా "బాబయ్యా" అటూ ఆరంభించాడు అప్పలరాముడు.

"ఇది యాభైయేళ్ళనాటి మాట. అప్పటికి ఇక్కడున్న జనంలో మీరెవ్వరూ పుట్టనేదు. అదుగో ఆ తంబంకాడ కూకున్న అశిర్నాయుడు గారొక్కరే నాకన్న పెద్దోరు. నాను నిజంవే సెపుతున్నానో, అబద్ధాలే సెపుతున్నానో ఆ బాబుకు తెలుసు. ఆయనే సాచ్చికం.

బాబయ్యా! అప్పుడు మా తండ్రి నచ్చిపోతూ నాకారెకరాలు, మా తమ్ముడి కారెకరాలు – మొత్తం ఐదెకరాల పల్లం యేడెకరాల మెట్ట ఇడిసిపెట్టి ఎల్లి పోనాడు. మాం ఇద్దరన్నదమ్ములం. మాకు అప్పలు ఐదుగురు.

మాం అన్నదమ్ములిద్దరం ఐదారేళ్ళు కలిసే వున్నాం. ఆ తరవాత అందర్లాగే యిడిపోనాం. యిడిపోయిన్నాటికి యీసెన్నర యీసెన్నర యెండి, రెండేసి తులాల బంగారం సెరో సిన్న కొంప వచ్చాయి.

బాబూ! అప్పుడీ వూరెలా గుండేదో యిక్కడి బతుకెలా గుండేదో మీరెవ్వరెరుగరు. నాకు తెలిసిన కాడికి అందరికీ ఇంతో అంతో సెక్కా ముక్కా ఉండేవి. కాపోళ్ళంతా పొలాలు దున్నుకు బతికేవోరు. గొల్లోళ్ళు గొర్రెల్నీ, మేకల్నీ కాసుకుంటూ సిన్న సిన్న మెరక ముక్కలు దున్నుకు బతికేవారు. మా మాలోళ్ళకి మెరక ముక్కలెక్కువ, పల్లాలు తక్కువ. మా వోళ్ళల్లో ఎవళ్ళో మరీ లేనోళ్ళు కంబార్లు గుండేవోరు. అంతింతోళ్ళు కూల్లు సేసుకుంటూ, బూవులు దున్నుకుంటూ బతికేవోరు.

బాబయ్యా! సెప్పకేం, ఒక్క జగ్గారాయుడు గారికి – అంటే యీ సూరెంబాబు తండ్రికి, ఆరి బాగార్లలో కొందరికీ తప్ప – అప్పట్లో యీ వూరు సాలోళ్ళకెవ్వరికీ జరుగుబాటుండేది కాదు. సీంవ నూలొచ్చాక ఆల మగ్గాలు మూలబడిపోయాయి. ఆల రాట్నాలు అటకలెక్కేసినాయి. ఆలు తిండికి సానా కష్టపడేవోరు.

అదిగలాంటి తరి గంగయ్య గోరని – దేశదిమ్మరి! ఆయన పడంవటెల్లి పొగాకు వొర్తకం తెచ్చినారు. సూరెంబాబు సిన్నాయినగోరు, ఎంకట నారాయన ఆయనకు తోడయ్యారు.

ఆ వొర్తకం అలాగలాగ బలిసింది. ఆ తరువాత ఆ పంటలుగూడ దిగుమతయ్యాయి.

యేరుశనగ లంతకు ముందే యీ సుట్టుపట్లకొచ్చినాయి. కాని జనానికి యేరుశనగ యెయ్యడవంటే బయ్యం. పొగాకు పెంచడవంటే బయ్యం. గోగులు పెంచడం నిన్నగాక మొన్న పుట్టింది.

అంతవరకూ యీ వున్న రైతులంతా వరి, గంటి, చోడి, జొన్న – ఇలాటి తిండిగింజ పండించే వోరు. అందరికీ తిండుండేది. గుడ్డముక్క లిన్నుండేవి కావు. కాని గోసిముక్కలుండేవి. కలిగినోళ్ళయినా పది బట్టలు కట్టేవోరు కారు. లావోతోలెంవో ఏదైనా మిగిలితే బంగారం కొని పిసరూ పిప్పీ సేయించి ఆడోళ్ళ మెడకి తగిలించే వోరు. దేవుడూ దెయ్యవని దానాలు దరమాలు చేసేవోరు. డబ్బుసిక్కిన మనుసులయితే ఎండీ బంగారాలు డిబ్బీల్లో దాసేవోరు.

బాబయ్యా! ఆ రోజుల్లో ఏ పెద్దనాయురాల్ని సూసినా, సిన్న సిన్న రైతులు ఆడంగుల్ని సూసినా, లచ్చుం దేవుల్లాగుండే వోరు. మెడ తిరక్కుండ బంగారాలు, ఏవీ లేకపోతే నానుపేట పట్టెడన్న మెడనుండేవి.

మా పేదోళ్ళ పెల్లాలుగూడ రెండేసి యీసెలు, మూడేసి యీసెలు ఎండి మోసేవోరు. అందెలు, కడియాలు, సందలు, మురుగులు, పోచీలు, దండకడియాలు, బమిడి మువ్వలు, పాయల మొలతాళ్ళు, బిల్లల మొలతాళ్ళు, ఒడ్డానాలు ఒకటేవిటి ఎన్నో వుండేవి.

ఈనాడు అలాటి వెక్కడా మీకు కాపడ్డం నేదు, ఆటి పేర్లే మీలో కొంతమందికి తెలియదు. ఏంవైనాయన్నీ?

వొర్తకం పంటలొచ్చినాయి. అవి నడుసు కొచ్చినాయా – జనం ఆటిని పట్టుకొచ్చినారు.

బాబయ్యా! యిప్పుడీ యెగిరికల్చరోళ్ళు యవసాయాల గురించి జనంతో సెప్పినట్టే అప్పుడీ సావుకోర్లు ఆ పంటల గురించి పెజకి నచ్చసెప్పేవోరు. పేదోళ్ళు బయపడ్డా పెద్ద రైతులు యేసిసూద్దావన్నారు.

అంతవరకు ఈ వూళ్ళో రూపాయల సెలామనీ ఎరగం. ఏదో ఉండేవంటే వుండేవి. పన్నులు సెల్లకట్టడానికని పెద్ద రైతులు దగ్గిరుండేవి. ఇచ్చి పుచ్చుకోడాలన్నీ దినుసుల్లో సాగేవి. డబ్బు మసలడ వారంభించినాక అన్నీ ఆటి లెక్కల్లోనే సాగడం మొదలయ్యింది.

బాబయ్యా! ఆ లెక్కలేటో జనానికి తెలిసేవి కావు. ఇప్పుణ్ణయాపైసల తిరకాసు ఉంది కదా – ఇంతకన్నా పెద్ద తిరకాసు లుండేవి.

అందుకే బయస్తులం డబ్బుజోలికెల్లీ వోళ్ళం గావు. దినుసు మార్పులోనే బోలెడు దగా జరిగి పోతుండేది.

బాబయ్యా! యే దినుసైనా మావమ్మబోతే రూపాయికైదు కుంచాలు. మాం కొనబోతే మూడే కుంచాలు. అదే మాదిరి మాం కొనేటప్పుడు కుంచాలు సిన్నవిగుండేవి. మావమ్మే ఏలకి పెద్దవై పోయేవి.

యేవయ్యా నీ యవ్వారం బొగ్గులవ! ఇదేం దరమం? అంటే – వర్తక దర్మం అనేవాడు కోవటయ్య.

మరి వొర్తకం పంటలొచ్చాక, కుంచాల తకరారుకు తోడు రైతులం రూపాయల మాయల్లో కూడా పడక తప్పింది కాదు.

వూళ్ళో సాలీలు సగానికి సగం మంది సావుకోర్లయి పోనారు. మిగిలినోరు ఆరికాడ పన్లు సేసుకుంటూ సిన్న సిన్న దుట్టా యాపారాలూ సేసుకుంటూ కాలం గడిపేసేవోరు.

ఆరోజుల్లో యీ ఊరు యిప్పట్లాగే పది పదిహేనూళ్ళకి సెంటరు గుండేది. అయితే ఉన్నట్టు కనపడేది కాదు. మంగలాపురం, తంగడుబిల్లీ, ఎంకన్నపేట, అగ్గరోరం, యిలా యీ యిన్నూళ్ళ వొర్తక పంటలూ యీ ఊళ్లో సావుకార్ల దోరానే శెలామణీ అవుతుండేవి.

"బాబయ్యా! పంటముకాన సావుకారొచ్చీవోడు. ఓ రప్పల్రావుడూ, ఓరసిరిగో! పుట్టీ ఏరుశనగల ధర యింతరా అనీవోడు. మాం సిత్తం బాబయ్యా అనీ వోళ్ళం. సరుకు పచ్చిది కాబట్టి తరుగింతరా అనీవోడు. సరే బాబయ్యా అనీవోళ్ళం. కొలగారం యింతా అనేవాడు. నోరు మూసుకునీ వోళ్ళం. నీకింతొస్తది. అవసరమైతే పుచ్చుకొనే వోళ్ళం. లేపోతే నీకాడే వుణ్ణియ్యయ్యా – అనీ వోళ్ళం.

ఆరోజుల్లో రైతులు సావుకార్లకు మదుపులెట్టేవోరు; సావుకార్లు రైతులకు వొడ్డీలు సెల్లించేవోరు. ఆ డబ్బు మదుపుల్లో సేర్చి ఎవ్వారాలు సేసేవోరు.

ఇలా సావుకార్లెంతతిన్నా రైతులకు కొంత గిట్టుబాటు ఉండేది. కాబట్టే ఎంత వొద్దనుకొన్నా రైతులు ఆ పంటలకు ఎగబడ్డారు.

తరువాత్తరువాత ధరలు పడిపోవడం, పెరిగిపోవడం ఆరంభించాయి. ఏరు సెనగలు ఏసి అవి పండితే ఆటి ధర పడిపోయేది. ఆ యాడాది మిరపకాయల ధర పెరిగిపోయేది. మిరప బాగా పండిన ఏడాది దానికి ధర పలికేది కాదు. పొగాకు జంయ్యమనీది.

ధరలెప్పుడు పడి ఎప్పుడు లెగిసిపోతాయొ తెలిస్తే బావున్ననిపించీది. కాని రైతోడి కెప్పుడూ అవి తెలిసి సచ్చీవి కావు.

బాబయ్యా! ఆనాటికీ యీనాటికీ నాకు బోదపడని సంగతొక్కటుంది. నా కాలం ముచ్చట సెప్పెను. మీ కాలంనాడు మీరే ఎరుగుదురు. బస్తా బియ్యం యేడు రూపాయీలు, బేడా వరక్కి గజం గుడ్డ. ఏడు రూపాయీలెక్కడ. ఏడు పదులెక్కడ; ఏ ధరవ తంద్రులెందు గురించి పెంచేస్తున్నారో – ధరలు! లేక ఆటి మానాన అవే సెల్లెదిగిపోయినట్టెదిగి పోతున్నాయో – తెలీదు.

బాబయ్యా! యిదిగిలాటి వూపుతావుల్లోనే కిందనున్న సావుకార్లు పైకి, పైనున్న రైతులు కిందికీ తూగిపోనారు. పదేళ్ళు గిర్రున తిరిగీ తలికి నాయురాళ్ళ మెడల్లో నగలు సావుకారమ్మలు ఏసుక తిరగడం మొదలెట్టినారు. సావుకోరు బాబులటు గుంటూరు కొవ్వూళ్ళనుండి యిటు బరంపురం బస్తర్ల దాకా ఏపారాల మీద తిరగడాలు ఎక్కువైనాయి.

బాబూ! యిక నా కత సెపుతాను ఇనండి".

అని గుక్క తిప్పుకొని, చుట్టూ వున్న జనమంతా చెవులు విడచి తనకేసే చూస్తుండటం గమనించి, పెరిగే ఉత్సాహంతో ఆరంభించాడు–

"–నాను మొదట్నుంచీ రెక్కలు ముక్కలు సేసుకు బదికినోణ్ణేగాని ఓపాలు మాలినోణ్ణీ, పోకిళ్ళు పోయేవోణ్ణీ కాను. కాన్డబ్బు కలిసొస్తాదంటే కాసీకిపోయి వొచ్చీ రకం.

మొట్టమొదట, మా సీతారావుడు పుట్టిన ఏడాది, మా మెరక సేల్లో గంటెలుడవడం మాని ఏరుశనగ ఏసినాను – అదీ ఒక పెడగా. ఆ యాడాది అదనూ పదనూ అన్నీకుదిర్నాయి.

ఓనాడు నేను సేలో కలుపు తీస్తావుంటే యీ గోపన్న బాబు ఆ దార్నే పోతూ గట్టుమీది కొచ్చినాడు. నే నాయన్ని సూడనేదు. ఆయన అన్నాడు.

ఏంరోయ్, అప్పల్రావుడు! సేను బాగానే పెరిగిందే! – అన్నాడు సేనుకేసి నూస్తా.

ఏదో నీ తల్లి తండ్రాదుల దీవన బాబయ్యా – అన్నాను.

కాయెవరి కమ్ముతావురో – అన్నాడు.

పండనియ్యయ్యా, అప్పుడెవరొచ్చడిగితే ఆరికే యిస్తానన్నాను. అప్పటికీ బాబుకి వచ్చీరాని మీసం.

ఒరేయ్ం, అప్పల్రావుడుం! ఉన్నవోడి కందరూ సాయంచేస్తారు. లేనోడికి పూతంవివ్వడంవే యివ్వడంరా! అన్నాడు.

అప్పటికీ బాబు బుజం మీద పుగాకు దుట్టా ఏసుకొని అగ్గురోరం, పూడిమడక తాటిసెట్లపాలెం, నాగోరం – సంతలకీ, సవుంద్రపొద్దు పల్లెలకీ, కమాను తిరుగుతుండీవోడు. ఆ యాడాదే ఓం పెదమం – అంటూ మెరక పంటల వొర్తకంలోకి దిగబోతున్నాడు.

బాబయ్యా! అది మొదలు మాంవిద్దరం నేస్తులంవయ్యాం వు. ఆ బాబు రైతుల్లో నానే మొట్టమొదటోణ్ణి. యీ నాటికి – సివరోణ్ణీ నానే. యీ మద్దెంతరంలో మా పేటోళ్ళు, మా సుట్టపక్కాలు, తరువాతేం వయ్యిందో తెలీదు. ఆ బాబు మీదికి లెగడం మాన్లేదు. నాను కిందికి దిగజారడ వారంబం వయ్యింది.

మొదట నా ఆరెకరాలు తొమ్మిదెకరాలయ్యింది. ఆ తరువాత – అప్పుడెకరం, అప్పుడరా, అప్పుడు పాతికా సొప్పున, ఆరెకరాలు సెల్లిపోనాయి. మా యెండి బంగారాలు ముండమోసేసినాయి.

బాబయ్యా! నానేగాదు మా పేటలో మూడొంతుల ముప్పాతిక మంది – గొల్లల్లో శానామంది, కాపుల్లో కొందరు కొందరు యీ సుడిగుండంలో పడి మునిగిపోనారు.

అంవున్నా అది సుడిగుండమే అయితే రైతులందర్నీ ముంచీయాల – కొందర్నీ ముంచి కొందర్నెలా ఒడ్డెట్టిందను.

కాపులందరివీ సెరువుల కింద పల్లపు యవసాయాలు. ఆళ్ళకి మెట్టబూంవులు తక్కువ. మాయి అట్నుండిటూ, సావుకోరి సుట్టరికాలకి ఆళ్ళు దూరం.

బాబయ్యా! సావుకోరి రుణంవెట్టిదో ఎరగని రైతోడుండడు. అయినా, సేజేతుల ఎల్లెల్లి ఆల వలల్లో సిక్కుకోని రైతులూ వుందరు.

నాను సావుకార్ల నేటో అంటన్నాననుకోకండి. ఎనక్కి శీరాంవులు బాబన్నట్టు అల్లది తెలియక సేసిన పాపంవే కావొచ్చు. కానది పాపంవే. అది ఊరంతట్నీ సుట్టేసింది. ముందు రైతోళ్ళు మునిగిపోనారు. తరవాత సావుకోర్లు.

పాతికేళ్ళనాడు యిరవైనుండి అరవై యేలదాకా వర్తకంలో తిప్పేవోళ్ళు – పది పదిహేను మందుండే వోరు యీ వూర్లో. సిన్న సిన్న వొర్తకుల సంగతి సెప్పనక్కర్లేదు. ఇప్పుడా డబ్బంత ఏంవై పోనాది?

పన్నులొచ్చినాక పొగాకు వొర్తకాలు దెబ్బ తినీసినాయి. పడవ టమ్మోర్లు యీలను శానావరకు నంచీసుకున్నారు. యేరుశనగ మిరపల వొర్తకాల్లో కొందర్ని జంక్షనుకాడ మిల్లులు, మరి కొందర్నీ టేశనుకాడ మిల్లులు – పెద్ద వొర్తకులు – యీలకన్న లోకం సూసినోళ్ళు – యీల్లను ముంచీసినారు. అయితే ఆ మిల్లులైన యిప్పుడున్నాయా? ఆట్నన్నింటినీ అంతకన్న పెద్ద మిల్లులు ఆవదాలవొలసవి మింగేసినాయి. మరి అవైన వుంటాయా? నాకు తెల్దుగాని, ఆట్నికూడ మింగుతున్న వీం మింగబోయేవీ యెక్కడో యేవో పుట్టి పెరుగుతూనే వుంటాయి.

బాబయ్యా! వొర్తకం జూదం వొకటే నన్నారు – పెద్దలు. నిజంవే అదెందుకు పుట్టింది? జనవెందుకు ఆడతన్నారు? నన్ను ముంచి నువ్వెందుకు మునిగిపోతన్నావు? బెమ్మదేం వుడు బలింవోణ్ణి కొడతన్నాడు కాబట్టి అనుంవోణ్ణి బలివోడు కొట్టడవేనా? నువ్వు తినా పెట్టని కాడకి నన్ను పట్టికెళ్ళి ఆల్లకెందుకు మేపుతావు? ఇదంతా నరుడు తెస్తున్న ముప్పా, నారాయనుడు బెదుతున్న సిక్కా? – మీరే సెప్పండి".

రావుడు ఆగిపోయాడు. ఆ వుద్రేకం తగ్గాక కొత్తగా ఆరంభించాడు.

"తంవరు, పదిహేనేళ్ళ క్రితం, ఈ ఊళ్ళో కాలు పెట్టిన్నాటికి మా యందరి బతుకులివీ.

బాబయ్యా! తంవరికి గురుతుందో లేదో – ఒకనాడు పొద్దోయిజేసి, బక్కలికి కుడుతు లెడుతున్నాను. మా పేటలోకొచ్చి మా యింటిముందే నిలునుని 'అప్పల్రాముడెవర'ని – నన్నే అడిగినావు. నానే బాబయ్యా–" అన్నాను.

'రాంవుడూ నీతో ఒకసారి మాటాడాల' – అని సింతమ్మ తల్లి గట్టుకేసి తీసికెల్లినావు. నన్నేటేటో అడిగినావు. నాను సెప్పాను. నువ్వేటేటో సెప్పావు. నా విన్నాను.

ఆ రాత్తిరి బాబయ్యా నీకు సెపితే అబద్ధం నాకైతే నిజం. తెల్లార్లూ కునుకునేదు.

యింతకాలానికి, పేదోల్ల సీకటి బతుక్కి దారిసూపే దరమరాజొచ్చినాడు. ఆ బాబు నల్లగుండి ఆయన సెప్పిన్దంత జరిగినా జరక్కపోయినా, మా యప్పుల్దీరిపోయి, మాకింత కూలినాలి దొరికి, జనవంత సల్లగుంటా రనుకున్నాను. అలాగుండాలని యెయ్యి దేవతలకు మొక్కుకున్నాను.

బాబయ్యా! తొలీత నువ్వీ వూర్లో అయిస్కూలెట్టించినావు. సదువుల్లేకపోతే మనుసులికి తెలివితేటలుండవురా, మీ పిల్లలు కూడా సదవాల అన్నావు. కాలే కడుపులకు సదువులు ముందా, అనుకున్నా – నిన్ను సూసి నీ మాటమీద గురికొద్దీ మాఁవూ శఁవదానఁ విచ్చాం. ఇప్పుడు కాకపోతే యిక ముందైనా మా పిల్లలు నదవరా అనుకున్నాం. కొంతమందిక్కూల్లూ దొరికినాయి.

తరవాత నువ్వీ వూరికి రోడ్డన్నావ్. ఏదో నీ పేరు జెప్పుకొని రెండేళ్ళు పేదారోదా శానామంది కడుపునింద గంజి తాగినారు.

ఆ తరువాత నువ్వు కోపరేటవ్ గోడౌన్లన్నావ్, నూతులన్నావ్ – కొంత కొంత మంది కొంత కొంత కాలం, రాయిారప్పా మోసుకొని బతికేసినారు. ఆ తరవాత కొత్త కొత్తపన్లు నువ్వీవూరికి తేలేకపోనావు. మా బతుకులు "ఎక్కడ ఏసిన గొంగలీలు అక్కడే" అన్నట్టు తయారయినాయి.

బాబయ్యా! నువు సూస్తూనే వున్నావ్. నీకన్నా ముందు నుండీ యీ వూరి జనవందరూ మమ్మేరుగుదురు.

మాఁవొక తాగుబోతులం కాదు, ఒక ముండల ముఠాకోర్లం కాదు. ఒక జూదగోళ్ళం కాదు. ఈనాడు మా మనవలంటే ఏసుక తిరుగుతున్నారు కాని, మాఁవా బనీను గుడ్డలు కూడా ఎరగం.

మాక్కావలసింది ముప్పూటల గంజీ మెతుకులు – ఇంతంబలి – గంటిజావ – జొన్నన్నం – ఉంటె కసిన్ని మజ్జిగ నీళ్ళు, లేకపోతే పులుసే. దానికి నంజుడు ఉల్లిపాయముక్క, ఊరి బిండొడియం; ఏవీ లేకపోతే మిరపకాయ కాల్చుకు తింటాం.

ఈ కసింత కోసఁవే ఇంటిల్లపాదిం పాటు పడతాం. మీలో యింటికొకళ్ళో ఇద్దరో తెచ్చీవోళ్ళుంటారు. మీరేం తింటారో, మీరెలాగుంటారో మీకే తెలుసు.

మాలో, అప్పుడు పుట్టిన బిడ్డల్నొదిలి, అరవై డెబ్భైయేళ్ళ వుద్ధురోళ్ళయినా మా ఆడంగులు కూడా మానాగే మా గొడ్లతో పాటు మున్నూటరవై రోజులు, ఎండనక, వోనలనక, సలనక, సంకటాలనక సాకిరీ సేస్తారు.

కూల్లులేని టైఁవులో కూడా మాయాడోళ్ళు ఇంటికాడ కూకునుండరు. కంపకని, కర్రకని, గడ్డికని, గాదంకని, యిందంటందంట తిరుగుతుంటారు. మా బొడ్డూడని బిడ్డ పాపలు పేడతట్టలట్టుకొని గేదెలెంబడే అవి ఎయ్యబోయే పేడకోనఁవని తిరుగుతూ, ఆ బంగారం కోనం గుద్దులాడుకుంటారు.

బాబయ్యా! మాఁ విందరఁవింత సేసినా మా పొట్టలు గడవటంనేదు, మా బూఁవులు సెల్లిపోతున్నాయి. మాకు రుణాలే మిగిలి పోతున్నాయి.

ఏఁవీ లేనోళ్ళు ఏడాత్తిరిగే సరికి కాఁవందులై పోతన్నారు. పదేళ్ళలో పాతిక ముప్పై ఏలు ఏనకేస్తన్నారు.

బాబయ్యా! యెవరి సొమ్మెవరు పడేసుకోవడం వల్ల ఎవరు గొప్పోల్లయి పోతన్నారో, ఎవరికెందువల్ల కూడు బుట్టకుండా పోతున్నదో మీరే సెప్పండి" అంటూ ఆగిపోయాడు.

రాముడు వేసిన ప్రశ్న. జవాబు కోరింది కాదు. అది సరే! ఒకవేళ కోరినా, జవాబు చెప్పటానికేమున్నది?

పొద్దు తిరిగిన మధ్యాహ్నపు టెండను కూడా సరకు చేయకుండా జనం, అప్పలరాముడి ఆక్రోశం వింటూ ఆకళ్ళు మరిచిపోయారు.

అతడు మాటమార్చే విధంగా ధోరణి మారుతుండగా అన్నాడు.

"రాత్తిరి మా యింటికాడ సిన్న తగువయింది. మా సీతారావుడు నన్ను నరికేస్తానని కూకున్నాడు. ఆడి కథ నువ్వెరిగే వుంటావు. మా రోజుల్లో మావోళ్ళు రంగఁవెళ్ళి గడించుకొచ్చీ వోరు, యీడు పట్టమెల్లి గడించుకొస్తానన్నాడు. అక్కడ రెండేళ్ళు బస్తాలు మోసినాడు. ఏడాది రికసాలు లాగినాడు. ఆడి పెల్లాన్నెవడో లెగదీసుకు పోయినాడు. ఆడి ఒక్కగాని ఒక్క కొడుకును ఎంటేసుకొని యింటికి పారొచ్చినాడు.

మాట మీద మాటొచ్చి రాత్తిరి నేనన్నాను.

నాయనల్లారా! యీ ముప్పై ముప్పైయేదేళ్ళ యిచ్చి పుచ్చికోడాల్లోను. వడ్డీలు వాసీల్లోనూ, సావుకారి సొమ్ము మనఁవే తిన్నావో, మన సొమ్ము సావుకారే తిన్నాడో యీ నాటికి అప్పంటూ యిది తేలింది.

ఇది మనం ఇచ్చి తీరాలని పెద్దలంతా పట్టుపడతన్నారు. రేపు శీరావులు నాయుణ్ణి రప్పించైనా మనసేత ఆ అప్పు సెల్లబెట్టిస్తారు గాని యిడిసి పెట్టరు. మీరు పట్టుబట్టి లాబం నేదు. బూవమ్ముకోడానికి వప్పేసుకోండి అన్నాను.

దానిమీద ఆళ్ళు మొదటనుండి పాడిందే మల్లా పాడినారు. నా నన్నాను గదా–

ఊరిమీద నాయులంతా మన బరువు మోస్తాం అంటున్నారు. ఆ పైన మన పాలిటి దేవుడు శీరావులు బాబున్నాడు మనం బతకలేక పోతాంవు(ట్రా అన్నాను.

బాబయ్యా! నువు కోపం తెచ్చుకోకు. నీ వూసెత్తేతలికి జనం మనిషిదొక మాటగ లంకించుకొన్నారు. నువ్వూరి కుపకారంగ సేసినవనీన మా కొంపలు ముంచడానికొచ్చినట్టు మాటాడ్నారు.

నువ్వు రోడ్డేయించినావు, నువ్వేయించిన రోడ్డుకు మా బళ్ళమీదే మా సేతులతోనే రాళ్ళు సేరిసినాం. ఆ సేతులతోనే ఆట్నీ పేర్సి మట్టిమోసి నునువు జేసినాం. దానిమీద జీపులొస్తన్నాయ్, కార్లొస్తున్నాయ్, లారీలు, బస్సులు తిరుగుతున్నాయి. గాని మా బళ్ళ బేరాలన్నీ పడిపోనాయి. యిసక్కీ, రాయికీ – సరుక్కూ, సప్పరకూ, పయనాలకి, అన్నిటికన్నీ సవగ్గ అవురుకొంటున్నాయి. యెనక పాతిక ముప్పై దాకా కుటుంబాలీ వూర్లో ఒక్క బళ్ళ బేరాల మీదే బతుకుతుండేవి.

నువ్వెల(ట్రిసిటీ యేంయించినావు, వంపింగు మిసెన్లొచ్చేసినాయి. ఏతాలు తోడే మా కూలోళ్ళ నోళ్ళల్ల బుగ్గడింది.

సూరెంబాబు రైసు మిల్లెట్టినాడు. కలిగినోళ్ళ యిల్లల్లో కూలికి దంచే జనం కూల్లు పోవడం మాటటుంచు. కూల్లు సేసుకు బతికే మా యాడ జనం కూడా కూలి తెచ్చుకున్న గింజలు పుట్టెడూ పందుం – కూలిచ్చి మిల్లుకేస్తున్నారు.

అలాగ ఆళ్ళంతా అంటా వుంటే – నానూరుకున్నాను. మాటాడనేక; అప్పుడు బారిక య(ర్రయ్యన్నాడు.

ఓరయ్యా! మీరన్న దాంట్లో కొంత నిజం లేకపోనేదు. కాని అంతా నిజంకాదు. నాకర్ధవయ్యిందేటంటే – ఆ బాబు సదువుల కోసవన్సెప్పి పట్నాలెల్లొచ్చిన మనిషి. అక్కడ జనంను సూసి అక్కడేటేటున్నాయో అయన్నీ ఇక్కడ క్కూడా తెచ్చేస్తే యిదీ పట్నం అయిపోద్ది, మనంవూ పట్టపోళ్ళ లాగ సుకాంగుంటాం అనుకున్నాడు. అంతేగాని తన్సేసిన దానివొల్ల కొందరి బతుకులు బుగ్గయి, ఆ బుగ్గిలెల్లి మరి కొందరికి బువ్వలు పుడతాయని ఆ బాబుకి తెలీదు.

తెలిస్తే ఇంత పని సేసుండడనే నా నమ్మకం అన్నాడు.

అప్పటికీ మావోళ్ళు నోళ్ళు పారేసుకోడం ఆపనేదు.

అప్పుడు నానన్నాను.

ఓరేయ్! నోటి కేదొస్తే అది పేలడం సబువు కాదు. నాయం, అన్నాయం ఆలోసనుండాల.

సూరెంబాబు యిరవై యేలు యిరాలం యిచ్చినాడు – పున్నానికే ఇచ్చినాడు. అందుకు మెచ్చే బగమంతుడు రైసు మిల్లెట్టించినాడు. ఇప్పుడు డబ్బొస్తన్న దంటే – ఆ బాబేం సేయగలడు?

అదే మాదిరి లచ్చుంనాయుడు బాబున్నూ, పున్నానికే బూవిచ్చినాడు. అయిస్కూలొచ్చినాక ఆ సుట్టూ బూంవులు ధరలు పెరిగిపోయినాయి. యిళ్ళ జాగాల కమ్మితే నష్టం పూడి లాబంవొచ్చింది. ఆ జాగాలు కొనుక్కున్నోళ్ళకు బలవంతాన గాని అంటగట్టినాడా?

అలాగని కూకలేసినాను.

దానికో గుంట పాపడన్నాడు గదా–

ఓరి తాతోయ్! మనంవూ ఇచ్చినాం శమదానం. మనపున్నేనికి బవుమతే దన్నాడు.

నీక్కూల్లు దొరకనేదా – అన్నాను.

దొరికినాయి. ఆ కూల్లు కానపడితేనే బతుకు బతుకంతా కూల్లు పుట్టని పనులు జరిగిపోనాయి. అదే మనం జేసిన పున్నానికి ఏ భగమంతుడిచ్చిన బవుమతి అన్నాడు.

అయితే లోకవంతా శీరాంవులు బాబును పొగుడుతున్నారు. అంతమందికి మంచైనోడు మనకి సెడ్డవుతాడ్రా? ... ఎక్కడో తప్పుంది – అన్నాను.

అంటేఇంకోడన్నాడు గదా – ఓరి దద్దా! శ్రీరాంవులు బాబును జనం పొగుడుతున్నారంటే దానికి కారనం ఏరు. ఈ వూరికి సెంటర్లు, కాఫీ వొటేల్లు, కిల్లీబడ్డీలు. ఆయనగా రెట్టించిన ఆఫీసుల్లో ఐస్కూల్లో వస్సెయ్యడానికీ, సదువుకోడానికే ఊరూర్ల నుండి జనం వొచ్చినారు. ఆల్లకోసం వైతేం, మనకోసవైతేం, సుట్టుపక్కల ఊరుల్లో జనం కోసవై తేం – అయన్నీ పుట్టినాయి.

ఎనక దివాల తీసిన సావుకార్ల బిడ్డలంతా ఇప్పుడు మల్లా పూటుకుంటున్నారు. ఆళ్ళు పొగడకేం సేస్తారన్నాడు.

నానాడికి జవాబు సెప్పేలోగానే ఎనకటి గుంట పాపడు అన్నట్టు తాతా ఆలేం పున్నేం సేసినా(రా – అన్నాడు.

నాక్కోపమొచ్చి–

ఓరే! మీ కర్మాలకు శీరాంవులుబాబు కర్తగాదు. ఆయనకు మంచిదన్తోచింది. ఆయన సేశాదు. అందువల్ల కొందరికి నష్టం, కొందరికి లాబం ఒస్తే వస్తాదన్నాను.

దానిమీద పెద్ద వోదనయ్యింది.

సివరకోడన్నాడు–

నీలాటి తారుపుగుల్ల నాయాల్లు మరో నలుగురీ వూర్లో వుంటే మరడగక్కర్లేదన్నాడు.

బాబయ్యా! డెబ్బై ఏళ్ళు నెత్తికొచ్చినాయి. యెంత బతుకు బతికినానో తంవరంతా ఎరుగుదురు. యీనాటికి నా జనం నన్నేటన్నారో యినండి.

అప్పుడు నా బాధ తెలిసి మా య(ర్రయ్య యింటికి సుట్టపు సూపుగా వచ్చిన పెద్దమనిషి అన్నాడు.

ఒయోయ్ బుల్లోళ్ళో ఆయన్నని నాబం నేదు. జరుగుతున్న దగా యెక్కడో మీకు తెల్సట్టే ఆయినికీ తెలవదు. దీనికంతటికీ కీలకం యిక్కడెక్కడా నేదు. పైనెక్కణ్ణుంచో వొచ్చిన ముప్పు మన్నందర్నీ ముంచుతోంది.

వండిన వంటంతా కాఁవందుల గోదాలకెళ్లాల. ఎల్లకుండా కూలోడు అడ్డు తగుల్తున్నాడు. ఎనకట్రోజుల్లో అయితే తన్ని సేయించుకునీ వోరు. ఇప్పటి రోజుల్లో ఆ పప్పులుడకవు. కూలోడి అడ్డు వొదిలించుకోవాలంటే మిసీన్లు కావాలి. మిసీన్లు తేవాలంటే యెలట్రిసిటీ, రోడ్లూ కావాలి. అంతేకాదు; సదువుకున్న కూలోళ్ళ కావాల. అందకనే యీ యిస్కూళ్ళు; అందకనే యీ రోడ్లూ, యీ యలట్రిసిటీ. ఇయన్నీ మన కోసఁవే అనుకోడం మన బుద్ధి తక్కువ. నీల్లు తోడ్డానికి మిసీన్లొచ్చేసి నాయనే గుంజుకు పోతన్నారు. రేప్పొద్దున దున్నడానికి, ఊదుపులకు, గొప్పులకు, కోతలకు కూడా మిసీన్లు రాబోతున్నాయి. అప్పుడు సూసుకోండి తడాఖా – అన్నాడు.

బాబయ్యా! మంచన్నది సెబ్బరైపోవడం నాకూ సిత్రంగానే వుంది. కాని జరిగిందీ జరగబోయేదీ సూస్తే, ఆల్ని కాదనడఁ వెలాగో నాకు తెలకందున్నాది.

నువ్వెవరి కుపకారం సేస్తానని బయలెల్లినావు? – అదెవరి కుపకారం అవుతోంది? మా గుంటపాప లేవఁన్న అనొచ్చు. నాను సూరెంబాబునీ, లచ్చుంనాయుణ్ణీ కూడా నెపపెట్టను. మనసులో పాపం దాచుకొని ఆల్లు నీ పందిట్లో అడుగెట్టనేదు. పున్నానికొచ్చిన వోరిని నువ్ మొదలెట్టిన యెగ్గెం, పాపంలో దింపింది. దిగినాక తెలిసీ తెలీకా అందరం కూరకుపోతన్నాం".

అని కాస్త సేపాగి–

"బాబయ్యా! యిదిగిలాగ బోదపరుస్తె, మాబోడిగాడితో కలుపుకుని అందరూరుకున్నారు. మా సీతారావుడు మాత్రం దిగిరానేదు.

ఆ దొక్కటే మాటన్నాడు.

ఓరయ్యా! నువ్వన్నదంత యిన్నాను. నువ్వూ మీ శీరావులు బాబూ ఆ యెనక తక్కిన పెద్దలు, ఆ రెంట జనఁవందరు – మీరంత మంచోళ్ళే కావొచ్చు – చెడ్డ చేసినా మంచుద్దేశాలే కావొచ్చు. నన్నీ వున్న కసింత బూఁవి అమ్మి కంబార్ని కమ్మనడం కూడ నా మేలుకోరే అయుండొచ్చు. కాని దీన్ని నాను అమ్మదలుసుకోనేదు. అమ్మను.

సావుకోరి అప్పును నాను కాదన్ను. నాక్కలిగితే కలిగినంత తప్పక తీరుస్తాను. సచ్చినంతకాలం శాకిరీ సెయ్యమన్నా సేస్తాను. కాని – బూవమ్మి తీర్చడమన్నది నా బొందిల పేనం వుండగ జరుగదు! అన్నాడు.

దానికి మా పెద్దయ్య – అవున్రా! ఆ బూవంత నీదే అయినట్టు మాటాడతవేటన్నాడు.

అన్నదమ్ముడి దగ్గరి కొచ్చీనరికి హక్కులూను ఎత్తుతున్నావ్. సావుకోరి కప్పగించమన్నప్పుడు నీ హక్కెటు బోనాదిరా ఎదవనాకొడకా! అంటూ సీతారాఁవుడు లెగిసి పోనాడు.

జనఁవందరడ్డుపడితే సివరికన్నాడు.

ఓరయ్యా! నేనిన్ని మాట్లోణ్ణిగాను. ఆ తరవాత సెప్పలేదనకు, బూఁవమ్మావా – నిన్ను నరికి పోగులెట్టి నన్ను నేను నరుక్కు సస్తాను, ఇది నిజం! ముమ్మాటికి నిజం – అన్నాడు.

ఎవరికి తెలిసినా ఎవరికి తెలీకపోయినా నాకాడి బాదేటో తెలుసు అన్నాను.

నాయినా! తల్లిదండ్రాదులు బిడ్డల్నెందుకు పెంచుతారు? ఏనాటికైనా దినం తీరుస్తారనే కదా, నీ సేతుల్లో సావుకన్న నానుకోరే దుండదు. కాని యీలోగా ఒక్కటి జరగాల.

రేపు శీరాఁవులు బాబొస్తాడు. శతయిదాల ఆ బాబు దరమం తప్పడు. ఒకయేల ఆ బాబుక్కూడా మనం బూఁవమ్మి సావుకోరి రుణం తీర్చడవే దరమంగ కనపడొచ్చు. ఆ బాబుకలాగ కనిపించిన్నాడు హరిమీద గిరిపడ్డా, గిరిమీద హరిపడ్డా నాను బూఁవమ్మి రుణం తీర్చడం ఖాయం. ఆ యిదంగా నా రుణం నాను తీర్చుకున్నాక నీ రుణం నువ్వూ తీర్చుకో అన్నాను".

ఇలాగంటూ అప్పల్రాముడు ఆగిపోయాడు. చివరి చివరి వాక్యాలు చెబుతున్నప్పుడు అతని గొంతులో ధ్వనించిన వేదన చాలా మంది హృదయాల్లో ప్రతిధ్వనించింది. ఆ తరువాత అతడు కొంతసేపు మతిబోయిన వాడిలా కనిపించాడు. చేతిలో ఉన్న కాగితం గాలికి రెపరెపలాడగా, అతడీ లోకంలోకి వచ్చాడు.

జనం అందరూ అతడికి అలసిపోయిన వారిలా కనిపించారు. ఎవరి మొహాల్లోనూ కళా కాంతులు లేవు. అతడు తలెత్తి శ్రీరాములునాయుడి వంక చూశాడు. నాయుడు మడగాళ్ళపై కూర్చొని వాలిన తలకు కుడి అరచేయి దాపు చేసుకొని, ఏదో దీర్ఘాలోచనలో ఉన్నాడు.

అప్పల్రాముడికి ఒక క్షణమంటే ఒక్క క్షణమే ఆశ కొట్టాడింది. తన కండ్లలోకే సూటిగా చూస్తున్న సూర్యంగారి కండ్లనూ, తన చేతికేసే విడవకుండా చూసే ముసలయ్య చూపులనూ, తననుండి తమ్మార్కు పెట్టె వద్దకూ, తమ్మార్కు పెట్టె నుండి తన వద్దకూ పరుగులు తీసే కరణం చూపులనూ – చూసి, గ్రహించి, అర్థం చేసుకొన్న తరువాత రాముడికి తనది అడియాస అని తేలిపోయింది.

ఒక్క దీర్ఘ నిశ్వాసం విడిచి రాముడు ముందుకు వెళ్ళి ఆ కాగితంపై వేలుముద్ర వేసేడు. అతడు తమ్మార్కు పెట్టె దగ్గిర నుంచి లేస్తుంటే, గోపన్న బిగ్గపట్టిన నరాలు సడలగా, "అమ్మయ్య" అన్నట్టు దిక్కులు చూశాడు.

తరువాత రాముడు కొడుకుల్నీ, మనవల్నీ ఒక్కొక్కరినే పిలిచి వేలుముద్ర వేయమన్నాడు.

అంతా అయ్యాక జనం సానుభూతి రాముడి వంక ప్రవహిస్తోంది. దేనికా ప్రవాహం? మురుగునీరు దానికన్నా నయం!

తండ్రి వెళ్ళి లేపగా సీతారాఁవుడు కూడా లేచేడు. వాడికళ్ళు చింతనిప్పుల్లాగా వుంటాయి. వాడు నల్లగా పొడుగ్గా వుంటాడు. వాడు జుట్టు సిగగా ముడి వేసుకొంటాడు.

అతను పత్రం దగ్గిరికొచ్చి దాని వంక తేరిపార చూశాడు.

తేరిపారి దాని వంక చూశాక అతడికేమయ్యిందో తెలియదు. గిర్రున వెనుదిరిగి అడ్డం వున్న వాళ్ళను తోసుకుంటూ దడదడ నాలుగడుగులేసి ఆ తరువాత వాళ్ళ పేటకేసి పరుగు పుచ్చుకున్నాడు.

"ఒరేయ్ సీతారాఁవుడు! ఓరయ్యా! ఓరే నాయనా! పారిపోకురా" అని అరిచాడు అప్పల్రాముడు.

సీతారాముడు వినిపించుకోలేదు. బాణంలా దూసుకుపోతున్నాడు. అతడు మలుపు తిరిగాక జనం ఏఁ వయ్యిందేవయింది? "ఎందుకూ?" "సీతారావుడు" "ఇప్పుడే" అంటూ ప్రశ్నోత్తరాలలో పడ్డారు.

ఉండి ఉండి ముసిలిది – అప్పల్రాముడు భార్య – "ఓలమ్మ! నేనేం సేదునే?" అంటూ ఒణికే సన్నని గొంతుతో ఏడవడం ఆరంభించింది.

"ఇప్పుడేటయ్యిందే? నువ్వేడొద్దు!" కసురుకున్నాడు అప్పల్రాముడు.

తరవాత–

కొంచెంసేపు నలిగి "సూసొస్తానుండు నువ్వేడకు" అంటూ బయలుదేర బోయాడు అప్పల్రాముడు.

"నువ్వెళ్ళొద్దొహె" తండ్రిని వారించి పెద్దకొడుకు మొలగుడ్డ విప్పి భుజం మీద వేసుకున్నాడు.

అతడి భార్య "నువ్వూ ఎల్లకు" అంటూ, అతడు వినకపోగా గుంపులోంచి బయటికి వచ్చి అతడి చేయి పట్టుకుంది.

ఆ కుటుంబం యిలా లజ్జ గుజ్జులు పడుతుండగా, ఇద్దరు ముగ్గురు నాయుళ్ళు అటూ ఇటూ పరుగుపెట్టిబలవైన చేపాటి కర్రలతో తిరిగి వచ్చారు. వాళ్ళ హడావిడి గమనించిన మాలలు కొందరు లేచి 'బాబయ్యల్లారా! తొందర పడకండి' అన్నారు.

అప్పటికి గాని శ్రీరాములు నాయుడు అక్కడేదో జరుగుతోందని గ్రహించలేపోయాడు.

గ్రహించాక – ఏ వేళ చూసినా చెరగని చిరునవ్వులు వెల్లివిరిసే శ్రీరాములు నాయుడు నవ్వు మొహంలో చీకట్లు చిక్కనై, గుడ్డి కళ్ళక్కూడ తెలిసిపోయేయి.

"మీరెవ్వరూ తొందరపడకండి –" అని ముందుకు వచ్చి, బొంగురుపోయిన కంఠాన్ని సవరించుకొని కీచుదేలిన కంఠంతో "నా మాట విని మీరెవ్వరూ తొందరపడకండి" అన్నాడు గట్టిగా.

గజ గజ వజ వజ వణుకుతున్నాడు శ్రీరాములు. ఆయన ఆపాదమస్తకం వణికిపోవడం జనంలో భయం కలిగించింది. భీతావహులైన జనంలో లక్షుంనాయుడి నిబ్బరం మళ్ళా ధైర్యం నెలకొల్పుతోంది.

అదిగో వస్తున్నాడన్నారు – మాల పేటకేసి చూస్తున్న జనం.

"చేతిలో ఏం ఉంది?"

"ఏమీ లేదు, భుజం మీద గోనెమూటున్నది".

ముందున్న లక్షుంనాయుడు వెనక్కు వెళ్ళిపోయాడు. తక్కిన వాళ్ళు ముందుకొచ్చి చూస్తున్నారు.

సీతారాఁవుడు అల్లంత దూరం నుండే ఆరంభించాడు.

"ఓరే ఓరె నాయన! అప్పల్రావుడా! నువ్వా కాయితం మీద ఏలు ముద్రెట్టిన్నాడు నీకూ నాకూ తండ్రి కొడుకుల రుణం సెల్లిపోద్దని సెప్పినాను; సెల్లిపోనాది.

నిన్న రేత్తిరి నీకు మరీ మరీ సెప్పినాను. అయినా నువు నా మాటిన్నావ్ కావు. ఎందుకిన్నావ్ కావు? – 'నాన్తండ్రిని యీడు నా కొడుకు. నా కొడుకయ్యుండి నా మాటెలా తప్పుతాడు, తప్పడ'నుకున్నావ్.

కొడుకులు తండ్రుల మాట తప్పరాదు. నిజవే! నాకూ ఒక్కొడుకున్నాడు. ఆడూ తప్పడు.

ఇదిగో నా మాట నిబద్దిసూసుకో–"

అంటూ పరుగెత్తి ముందుకొచ్చి భుజం మీద గోనెబస్తా ఒక్కుదుటున ఎదరకు లాగి కొనలు బట్టుకొని దులిపాడు.

అప్పల్రాముడి పాదాల ముందు "టక్" "దబ్"మని ఒక తలా చిన్న దేహం నేలమీద రాలాయి. రక్తసిక్తమైన మట్టిలో పొర్లిందా చిన్న తల. దిగంబరమై, నల్లనిదై, రెండు చేతులా నేలను కరచుకొని రక్తం కమ్ముతున్నదా – లేత దేహం.

అతి జుగుప్సాకరములైన ఆ రెండు పదార్థాలను చూచిన జనం నివ్వెరపోయి, జడిసిపోయి, ఆశ్చర్యపోయి, మతులు పోతుండగా "ఓయమ్మో! ఓరి నాయన! ఓరిబాబో! అయ్యయ్యో! అమ్మమ్మ! ! ఎంత గోర వెంతగోరం" అంటూ – ఆపైన బెదిరిపోయి, ఒణుకులుచ్చుకొని, శతనులు దప్పుతున్న శరీరాలను, అవి పూర్తిగా స్వాధీనం తప్పక ముందే, భద్రమనకునే దూరం వరకూ, ఫరవాలేదనిపించే చోటుల

వరకూ, జరుపుకొని పోయారు. వెనుకనున్న కొందరు ఆ కలకలం చూసి ఏమిటేమిటంటూ ముందుకొస్తున్నారు.

అప్పల్రావుడు అక్కడే, అలానే నిల్చున్నకాడ నిల్చున్నట్టే కొయ్యగట్టి పోతున్నాడు. నిప్పుల తూపుల్లా నాటవలసిన కొడుకు చూపులు పిడుగుల దెబ్బల్లా తాకవలసిన అతడి మాటలు నిలువుకళ్ళతో నించున్న అప్పల్రాముడి శరీరాన్ని గాని, ఆత్మనుగాని బాధిస్తున్న దాఖాలాలు లేవు.

సీతారావుఁడు అంటున్నాడు.

"నానెంత సెప్పినా నీ కళ్ళపొర తెగనేదు. నయాన సెప్పినాను. నిన్ను సంపుతానన్నాను. నన్ను నరుక్కు సస్తానన్నాను. అయినా నువ్వు నా మాటిన్నావ్ కావు.

ఎందుచేత?

నీకు జనం మెప్పు కావాల, అప్పల్రాఁవుడు శానమంచోడు. ఆడి తప్పనోడన్న మాట కావాల. అమాయకుడన్న పేరు కావాల. నీ బిడ్డ పాపలెలాగట పోనీ. నీకున్న దంబం అంత యేటట? దరమం తప్పదు: కల్నీ ఎవడు సెప్పిన దరమం? ఏటా దరమం?

ఓరయ్యా! నువు నీ బిడ్డలకేం సేస్తన్నవో, నీ కుటుంబానికేటవుతోందో, నేనెంత సెప్పినా నీ కంటిగ్గాని, జనం కంటిగ్గాని కాపడ్డంనేదు. ఏరి కంటిక్కన పడకండా నువ్వేం సేస్తన్నావో – అదే పని అందరి కంటికీ కనపడేటట్లు నానూ సేసేను.. సూసుకో," అంటూ భూమికేసి చూపేడు. అటు వంగిన అప్పల్రాముడి శిరస్సు అలానే ఉండిపోగా–

''నువు మమ్మల్ని నచ్చిందాక బానిన బతుకు బతకమన్నావ్. నీకు తెల్నప్పుడు అది సరే. ఇప్పుడు తెనిసినాకా నువు ఆ మాటే అంటే – ఇదిగో నాకిష్టం నేదు.

నా కొడుకు మీద నాకాశెక్కువ. నా కొడుకు బానిసబతుకు బతకడు. నా కొడుకు కంబారి కాడు.

అందుకే పరుగెత్తుకెల్నాను. ఒరేయ్! ఓరె, కొడుకా, నువు బానిస బతుకు బతుకుతావా – లేకపోతే సస్తావా? యీయాల సస్తే రేపటికి రెండు. రా నిన్ను సంపుతా నన్నాను. ఆడు పరుగెత్తికొచ్చినాడు. నాను పటక్కెన నరికేసినాను. ఆ కత్తటు బారేసి యిటు లగెత్తుకొచ్చినాను.

నువ్వూ తండ్రివే నానూ తండ్రినే, ఎవరు గొప్పో నువ్వే సెప్పు"

ఇలా అంటూ .. సీతారాఁవుడు ఆగిపోయేడు. మనవడి దగ్గర చతికిల బడపోతున్న అప్పల్రావుడి నుండి చూపులు తిప్పుకోవడానికి సీతారాఁవుడు జనంకేసి చూశాడు. తమకేసి తిరుగుతున్న సీతారాఁవుణ్ణి చూసి జనం కకాపికలవుతన్నారు. వాళ్ళను చూసి కడుపులో దేవినట్లుగా కాగా : సీతారాఁవుడు అరనవ్వుతో అన్నాడు–

"బాబయ్యల్లారా! జడిసిపోకండి, జనం మీద సెయ్యెత్తగల మనిషే అయితే యీ సీతారాఁవుడు కన్నబిడ్డను సంపుకోడు".

అంటూ జనాన్ని ఆపబోయేడు, అయినా జనం చెదిరిపోయారు. అప్పుడు బయటపడ్డ చేపాటి కర్రల వాళ్ళుంటే వాళ్ళతో అన్నాడు.

"బాబూ, మీరూ తొందర పడకండి. నాను ఉరికే సిద్ధం; నాకు సావో నెక్కకాదు. నన్ను కొడితే మీరు ఉరిలో పడతారు. మీ బిడ్డ పాపల ఉసురు నాకేల తగలాల?" అన్నాడు.

ఆ తరవాత అతను మండపం కేసి తిరిగాడు.

అతని చూపులు శ్రీరాములునాయుణ్ణి వెతికిపట్టేయి. అతడికేసి చూసి చూసి అన్నాడు.

"బాబూ శీరాఁవులు బాబు! నువ్వంటే నాకు మా సెద్ద కని; ఎప్పుడు? ఇంతకు పూరవం. ఇప్పుడో – నేదు. ఎందుసేతో తెలుసునా? నువ్వత్త యెర్రిపీరువి.

లోకవంత నువ్ సెప్పినట్టినాలని, ఇంటారని నీ మనసులో ఓ ఉద్దేశం. ఈ రాజ్జాన్నీ నిన్నూ ఏలే దొరలెవరో యెరుగుదువా – అదిగో ఆ బాబులిద్దరు. అదిగో ఆ కరణమయ్య, అదిగో ఆ మునసబయ్య. ఆళ్ళకి ఆళ్ళు సేసుకోలేని మంచిని నువ్వు సేసినంత కాలఁవే నీ రాజ్జం. ఆ తరువాత – ఆళెవరో, నువ్వెవరో, ఆ సంగతి నీకిప్పుడు తెలీదు".

ఇలా అంటూ మునసబును చూసి వెర్రినవ్వుతో అన్నాడు.

"బాబూ, మునసబ్బాబు! శానాకాలానికి నీకు పన్తగిలింది. శీరాఁవులుబాబు మన్డపం తెరిచిన రోజున నువ్వూ ఓ మాట అన్నావట. ఇప్పుడు సెప్పు అచ్చురిపోర్టు కొస్తావా, నా కూనీ మాఫీ సేస్తావా?"

ఇలా అంటూ ఎలా నించున్న వాడలా ఆ న్యాయ మండపం ముందు చతికిల పడిపోయాడు – సీతారాముడు.

ధర్మపన్నాలెంత వరకూ?... అంతా నువ్ చెప్పినట్టు వినేవరకూ;

ఆ తరువాత .... ! ★

*(రచన: మే 1964 :: ప్రచురణ: యువ దీపావళి సంచిక 1966)*

